
# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 22 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:116 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## ముంబైలో మాయే మస్క్



సిద్ధి వినాయక ఆలయంలో పూజలు

2

## విచ్చేసిన జేడీ వాన్స్ దంపతులు



2

# తులం బంగారం లక్ష రూపాయలు

## దానికి దగ్గరలోనే వెండి..

మంబై, ఏప్రిల్ 21: భారత దేశంలో బంగారం ధర సరికొత్త రికార్డును సృష్టించింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ట్యాక్సుతో కలిపి అక్షరాలా లక్ష రూపాయలకు ఎగిసింది. అమెరికా, చైనా వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో మదుపర్లు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ ...మిగతా 2లో



# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

## వాటికన్ నివాసంలో తుదిశ్వాస

- కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న మతాధిపతి
- మరణానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ సందేశం
- నైట్ క్లబ్ బౌన్సర్ నుంచి పోప్ దాకా ఎదిగిన జార్జ్ మారియో బెర్గోగ్లియో
- ప్రధాని మోడీ, సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, మనం ప్రతినిధి: రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గౌరవించే క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7:35 గంటలకు వాటికన్‌లోని తన నివాసమైన కాసా శాంటా మార్టాలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వాటికన్ న్యూస్ తమ వెబ్‌సైట్‌లో విడుదల చేసిన ప్రకటనలో అధికారికంగా ప్రకటించింది. గత కొంతకాలంగా పోప్ ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియా, కిడ్నీ సంబంధిత ...మిగతా 2లో

### పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ ఉందో లేదో కూడా వైకాపా నేతలకు తెలియదు



రాజమహేంద్రవరం: పోలవరం ప్రాజెక్టు 2027 డిసెంబర్ నాటికి పూర్తి అయ్యేలా పనులు చేస్తున్నామని మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా, ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. రాజమహేంద్రవరంలో మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. జగన్ ఇరిగేషన్ శాఖలోనే రూ.18వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని, గత ప్రభుత్వం లష్కర్లకు ఏడాది జీతాలు బకాయిలు పెడితే.. కూటమి ప్రభుత్వం చెల్లించిందని ...మిగతా 2లో



# మోదీ పర్యటనతో అమరావతి పనులు ఊపందుకుంటాయి: మంత్రులు

అమరావతి: ప్రధాని మోదీ పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఏపీ మంత్రులు తెలిపారు. ఏపీ పర్యటనలో భాగంగా మే 2న సాయంత్రం 3 గంటలకు ఆయన గన్నవరం చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోదీ గంటపాటు ఉంటారని చెప్పారు.గత ఐదేళ్లు రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని, అందువల్ల రైతులను కూడా గౌరవించుకోవాలని నాదెండ్ల మనోహర్ అన్నారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పునఃప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివృద్ధి పనులను మోదీ ప్రారంభిస్తారని అన్నారు.

# రాబోయే అవకాశాలను అంచనా వేయాలె

### వ్యవస్థలను నిర్వహించడం పాత పద్ధతి.. టెక్నాలజీతో లభించిన అవకాశాలను ప్రగతిగా మార్చాలె

### పరిపాలన అంటే ప్రస్తుత అర్థమదే : ప్రధాని మోడీ

2

### గుడ్‌న్యూస్.. ఆ జిల్లా ప్రజల కోరిక నెరవేర్చనున్న కూటమి సర్కార్



గుంటూరు జిల్లా: గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడంతో శంకర్ విలాస్ బ్రిడ్జిని ఆధునీకరణ చేయబోతున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.1958లో కట్టిన శంకర్ విలాస్ బ్రిడ్జి శిథిలావస్థకు వచ్చిందని అన్నారు. నందివెలుగు బ్రిడ్జి అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం 2014లో మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఇవాళ(సోమవారం) శంకర్ విలాస్ పై వంతెన కోసం భవనాలు, ...మిగతా 2లో

# సుబ్రహ్మణ్యం హత్య కేసు.. మళ్లీ విచారణ చేపట్టాలి

## ఏబీ వెంకటేశ్వరరావు



కాకినాడ: వైకాపా నేత అనంతబాబు చేతిలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం దారుణ హత్యకు గురైనట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అతడి తల్లిదండ్రులను విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు కలిశారు. 2022 మే 20న జరిగిన ఈ హత్య ఏపీ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సష్టించిన సంగతి తెలిసిందే. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులను పరామర్శించిన అనంతరం ఏబీవీ మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో జరిగినంత లోపభూయిష్టమైన దర్యాప్తును తన 35 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు.

''దళిత యువకుడు చనిపోయాడు న్యాయం చేయాలన్న ఆలోచన లేకుండా, కేసు వీగిపోయేలా ...మిగతా 2లో

## జగన్ వ్యవస్థలను భ్రష్టు పట్టించారు.. టీడీపీ ఎంపీ విసుర్లు




ఢిల్లీ: అమరావతి పునర్మాణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రావడం శుభసూచకమని తెలుగుదేశం పార్టీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం అవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలుస్తారని అన్నారు. ప్రధాని మోదీ పర్యటన కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి సూచిక అని టీడీపీ ...మిగతా 2లో

## జనవాణి పనివేళల్లో మార్పు..



అమరావతి: అర్జీదారుల సౌకర్యార్థం వాతావరణంలో ఎండ తీవ్రత వల్ల జనవాణి పని వేళల్లో మార్పులు చేస్తున్నట్లు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ కొత్త పని వేళలు సోమవారం నుంచి గురువారం వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 4:30 గంటల నుండి 5:30 గంటల వరకు ఉంటాయని పేర్కొంది. ...మిగతా 2లో

## రూ.28 వేల కోట్లతో ట్రాన్స్‌కో నెట్‌వర్క్



అమరావతి: రాయలసీమ నుంచి కాకినాడ వరకు ట్రాన్స్‌కో నెట్‌వర్క్ ఆగ్‌మెంటేషన్ కోసం ప్రతిపాదించిన ప్రాజెక్టుకు కేంద్రం సూచనప్రాయంగా ఆమోదం తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రాజెక్టు నివేదికలోని కొన్ని సందేహాలపై అధికారుల నుంచి వివరణ తీసుకుంది. రాయలసీమలో ఇప్పటికే ఉన్న, కొత్తగా ఏర్పాటుకానున్న సౌర, పవన, పునరుత్పాదక ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజి, బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల ...మిగతా 2లో

## ఏప్రిల్ 23న పదో తరగతి పరీక్షల ఫలితాలు



అమరావతి: ఏపీలో పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఏప్రిల్ 23న ఉదయం 10గంటలకు ఈ ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫలితాలను సైతం విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ ఫలితాలను ...మిగతా 2లో

### లుగు ఎన్‌కౌంటర్

# మావోయిస్టు కీలక నేత ప్రయాగ్ మాంఝీతో సహా ఎనిమిది మంది మృతి

### ప్రయాగ్ అలియాస్ వివేక్ తలపై కోటి రివార్డు

### మరో ఇద్దరిపైనా చెరో రూ. 10 లక్షల రివార్డు



రాంచీ, ఏప్రిల్ 21: ఝార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లాలోని లాల్పానియా ప్రాంతంలోని లుగు పర్వత ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కీలకనేత ప్రయాగ్ మాంఝీ మృతి చెందాడు. ఈ ఎదురు కాల్పుల్లో ప్రయాగ్‌తో పాటు ఎనిమిది మంది చనిపోయారు. ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్‌ను పుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఈయన తలపై రూ.కోటి రివార్డు ఉంది. చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ అనే వారిపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయి. కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ధనాబాద్ జిల్లా తుండీ ...మిగతా 2లో



# మేలో ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా

### అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో ఏడు ఎక్స్‌పెరిమెంట్లు చేయనున్న మన వ్యోమగామి

ఢిల్లీ, ఏప్రిల్ 21: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేపట్టబోయే యాత్ర కోసం ప్రధాన వ్యోమగామిగా ఎంపికైన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా మార్గ్జిమమ్-4 మిషన్లో భాగంగా మే నెలలో ఆయన ఐఎస్ఎస్ కు వెళ్లనున్నారు. అక్కడకనీసం ఏడు ప్రయోగాల్లో పాల్గొంటారు. అంతరిక్షంలో పంట సాగు, వాటర్స్ బేర్ (నీటి ఎలుగుబంటి) గురించి అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. టార్డిగ్రేడ్, సూక్ష్మ కణజాల జీవిగా పిలిచే నీటి ఎలుగుబంటి భూమండలంపై జీవించి ఉండే అత్యంత అరుదైన జీవి. 0.3 మి.మీల నుంచి 0.5 మి.మీల పొడవు ఉండి పర్యావరణంలో అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని జీవించే డీఎన్ఏను కలిగి ఉంటుంది. ఇలాంటి అరుదైన జీవి డీఎన్ఏను డీకోడ్ చేసిన ఇస్రో.. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో పునరుత్పత్తిని.. భూమి, అంతరిక్షంలో జన్యు మార్పిడిని అధ్యయనం చేయనుంది. అత్యంత శక్తిమంతమైన సూర్యరశ్మితో పాటు గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలో ఈ జీవి డీఎన్ఏలో కలిగే మార్పులకు అనుగుణంగా వ్యోమగాముల రక్షణ వ్యవస్థలను తయారు చేయనుంది. ఈ అధ్యయనం త్వరలో ప్రయోగించే మానవసహిత గగన్యాన్ మిషన్ కూ ఉపయోగపడనుందని ఇస్రో అంచనా వేస్తోంది. అలాగే ఈ యాత్రలో భాగంగా అంతరిక్షంలో కంప్యూటర్ స్క్రీన్లను ఉపయోగించడం వల్ల కలిగే మార్పులను అర్థంచేసుకోనున్నారు. మైక్రోగ్రావిటీలో గేజ్ ఫిక్సేషన్, వేగంగా కంటిని కదిలించడం వల్ల ఒత్తిడి స్థాయిలు ఎలా ఉంటాయో పరిశీలించనున్నారు. దీనివల్ల భవిష్యత్ అంతరిక్ష నౌకల్లో కంప్యూటర్ల ...మిగతా 2లో

# అమెరికాతో డీల్ చేస్తే అంతే సంగతులు



## ప్రపంచ దేశాలకు చైనా హెచ్చరిక

బీజింగ్, ఏప్రిల్ 21: చైనా ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో డీల్ కుదుర్చుకుంటే దాన్ని తాము తీవ్రంగా ఖండిస్తామని బీజింగ్ హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుంచి బయటపడేందుకు అనేక దేశాలు అగ్రరాజ్యంతో బిజీబిజీగా చర్చలు జరుపుతున్నాయి. అయితే, టారిఫ్ల నుంచి ఉపశమనం కావాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని తన మిత్ర దేశాలకు ట్రంప్ సర్కారు షరతు పెట్టినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలపై తాజాగా బీజింగ్ ...మిగతా 2లో

### ఆ తప్పులు చేయొద్దు

## డొనాల్డ్ ట్రంప్ సీరియస్ వార్నింగ్

వాషింగ్టన్, ఏప్రిల్ 21: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య పరంగా ఎనిమిది రకాల తప్పులు చేసే దేశాలను వదలిపెట్టనని హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా వాణిజ్యం విషయంలో అత్యంత కఠిన వైఖరిని అవలంభిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రపంచ దేశాలకు మరో అల్టిమేటం జారీ చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాలు కాకుండా ఇతర రూపంలో అమెరికాను ...మిగతా 2లో

# రాబోయే అవకాశాలను అంచనా వేయాలె

ఢిల్లీ, ఏప్రిల్ 21: తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేండ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని, రాబోయే అవకాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. 'సివిల్ సర్వీసెస్ డే' సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సమగ్రాభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేండ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేరుస్తూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చడానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుంది' అని ప్రధాని అన్నారు.

'టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేండ్లలో దేశంలో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్పులను నెలకొల్పుతోంది' అన్నారు.

'2023లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈ సందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపికగా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి' అని ఈ సందర్భంగా వారికి సూచించారు.

## తులం బంగారం లక్ష రూపాయలు

(మొదటి పేజీ తరువాయి)

విపణిలో ఔన్సు పసిడి సోమవారం 3,405 డాలర్లకు చేరింది. దీన్ని అనుసరించి దేశీయంగా లక్ష రూపాయల మార్కును అందుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయానికి 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కు చేరింది. మరో పక్క వెండి ధర సైతం కిలో లక్షకు చేరువవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా- చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంతవరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ ఉందో లేదో కూడా వైకాపా నేతలకు తెలియదు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ''అసలు ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ ఉందో లేదో కూడా వైకాపా నేతలకు తెలియదు. దానిపై వారికి అవగాహన కూడా లేదు. గతంలో చంద్రబాబు రూ.430 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే జగన్ విధ్వంసం చేశాడు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు మొదలుపెట్టాం. రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 20 నాటికి 202 మీటర్లకుపైగా వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఏప్రిల్ 30 కల్లా మూడో కట్టర్ అందుబాటులోకి వస్తుంది. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామ్‌ను బలోపేతం చేయడానికి బట్రస్ డ్యామ్ మే నెలకల్లా పూర్తి చేస్తాం. డయాఫ్రమ్ వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా.. సమాంతరంగా గ్యాప్-1 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని ఏప్రిల్‌లో మొదలుపెట్టాం. గ్యాప్-2 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ఈ ఏడాది నవంబర్ 30లోగా మొదలుపెట్టేలా సీఎం చంద్రబాబు ప్రణాళికను అమలు చేస్తాం''అని మంత్రి నిమ్మల తెలిపారు.

## ఏప్రిల్ 23న పదో తరగతి పరీక్షల ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in/ వెబ్‌సైట్‌లతో పాటు 'మన మిత్ర' వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు దాదాపు 6లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరైన విషయం తెలిసిందే.

**మన మిత్రలో రిజల్ట్స్ ఇలా పొందొచ్చు..**

అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్‌లోని వాట్సప్‌లో 9552300009 నంబర్‌కు అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, రోల్ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా ఫలితాల పీడీఎఫ్ కాపీని పొందవచ్చు. అలాగే, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. %హాజు% మొబైల్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా ఫలితాలు పొందే సౌలభ్యం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు.

## సుబ్రహ్మణ్యం హత్య కేసు.. మళ్లీ విచారణ చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

నివేదికలు ఇచ్చారు. ఎఫ్ఐఆర్‌కి, ఛార్జ్‌షీట్‌కి సంబంధం లేదు. మధ్యవర్తులు చెప్పేదానికి, ఎస్పీ వాదనకు పొంతన లేదు. ఛార్జిషీటు దానంతట అదే వీగిపోయేలా, కేసు కొట్టేసేలా ఈ కేసును నీరుగార్చారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ చరిత్రలోనే ఒక మచ్చగా మిగిలిపోయే దర్యాప్తు ఇది. న్యాయస్థానం అనుమతితో ఓ ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేసి.. మళ్లీ మొదటి నుంచి విచారణ చేపట్టాల్సిన అవసరముంది. ఈ విషయమై కాకినాడ కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి వచ్చాను. కాకినాడలో ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేసుకునే కుటుంబం.. బెదిరింపులకు భయపడి ఒక మారుమూల పల్లెలో నాలుగు ఇళ్లల్లో పాచిపనులు చేసుకునే పరిస్థితి వచ్చింది.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఈ కారణంగా ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స పొంది, గత నెలలోనే డిశ్చార్జ్ అయ్యారు. అర్జెంటీనాలో జన్మించిన ఆయన, దక్షిణ అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రజల పోప్ గా పేరుగాంచిన ఆయన, సామాజిక అంశాలపై తన గళం వినిపించేవారు. ఆశ్చర్యకరంగా, మరణించడానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ పర్వదినాన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేలాది మంది భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. అనారోగ్యం తర్వాత అంతమంది ప్రజల మధ్యకు రావడం అదే తొలిసారి. ఆయన మృతితో ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ సమాజం విషాదంలో మునిగిపోయింది. కార్డినల్ ఫారెల్ ఆయన మృతిని ప్రకటిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జీవితం ప్రభువుకు, చర్చికి సేవ చేయడానికే అంకితమైందని పేర్కొన్నారు.

**కామన్ మ్యాన్ నుంచి క్యాథలిక్ చర్చి అధిపతి దాకా..**

పోప్ ఫ్రాన్సిస్ అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. ఆయన డిసెంబర్ 1936 17న అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో జన్మించారు. ఇటలీ నుంచి వలస వచ్చిన మారియో జోస్ బెర్గోగ్లియో, రెజీనా మరియా సివోరి దంపతుల ఐదుగురు సంతానంలో ఆయనే పెద్దవారు. తండ్రి అకౌంటెంట్ కాగా, తల్లి ఇటాలియన్ వలసదారుల కుమార్తె.




క్రైస్తవ మతగురువుగా మారడానికి ముందు, జార్జ్ మారియో బెర్గోగ్లియో పలు సాధారణ ఉద్యోగాలు చేశారు. నైట్‌క్లబ్‌లో బౌన్సర్‌గా, స్కూల్లో స్వీపర్‌గా, రసాయన ప్రయోగశాలలో టెక్నీషియన్‌గా పనిచేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. 2013లో రోమ్‌లోని ఒక చర్చిలో మాట్లాడుతూ, తాను నేలలు తుడవడం, కెమికల్ ల్యాబ్లో పనిచేయడం, హైస్కూల్లో బోధించడం, చివరికి క్లబ్బులలో గొడవ చేసేవారిని నియంత్రించడానికి బౌన్సర్గా కూడా పనిచేశానని ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, బౌన్సర్‌గా తన అనుభవాల గురించి లేదా అవి తన నాయకత్వాన్ని ఎలా ప్రభావితం చేశాయనే దానిపై ఆయన వివరాలు పంచుకోలేదు. బదులుగా, సాహిత్యం, మనస్తత్వశాస్త్రాన్ని బోధించడం ద్వారా ప్రజలను తిరిగి చర్చి వైపు ఎలా తీసుకురావాలో నేర్చుకున్నానని ఆయన చెప్పినట్లు వాటికన్ పత్రిక 'ఎల్'ఒస్ఆర్వటోర్ రొమానో' పేర్కొంది. ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లడానికి ముందు, బెర్గోగ్లియో కెమిస్ట్రీ అభ్యసించి, టెక్నికల్ డిప్లొమా కూడా పొందారు. అయితే, తనకు ఎంతమాత్రం పరిచయం లేని, గతంలో ఎన్నడూ కలవని ఒక మతగురువుతో జరిగిన 'ఒప్పుకోలు' తన జీవితాన్ని శాశ్వతంగా మార్చివేసిందని, మతగురువు కావాలనే తన లోపలి పిలుపును అప్పుడే కనుగొన్నానని ఆయన ఒక సందర్భంలో పంచుకున్నారు. 1969 డిసెంబర్ 13న ఆయన జెస్యూట్ ఆర్డర్‌లో మతగురువుగా దీక్ష పొందారు. 1970లలో అర్జెంటీనాలో కఠినమైన నియంతృత్వ పాలన సమయంలో ఆయన ఆ దేశంలో జెస్యూట్ ఆర్డర్కు ప్రొవిన్షియల్ సుపీరియర్‌గా నాయకత్వం వహించారు.

**చరిత్ర సృష్టించిన 'తొలి' పోప్..**

పోప్ ఫ్రాన్సిస్ అనేక 'తొలి' ఘనతలకు ప్రతీక. అమెరికా ఖండాల నుంచి ఎన్నికైన తొలి పోప్ ఆయనే. జెస్యూట్ ఆర్డర్ నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తి కూడా ఆయనే. పేదలు, అణగారిన వర్గాల పట్ల అపారమైన సేవాభావం కలిగిన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి స్ఫూర్తితో 'ఫ్రాన్సిస్' అనే పేరును స్వీకరించిన తొలి పోప్ కూడా ఆయనే. 2013లో చారిత్రాత్మకంగా పోప్‌గా ఎన్నిక కావడానికి ముందు, ఆయన కార్డినల్ జార్జ్ మారియో బెర్గోగ్లియోగా బ్యూనస్ ఎయిర్స్ ఆర్చ్ బిషప్‌గా సేవలందించారు. 'ఫ్రాన్సిస్' అనే పేరును ఎంచుకోవడం వినయం, కరుణ, సేవ పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. శతాబ్దాల తర్వాత ఐరోపాయేతర ప్రాంతం నుంచి ఎన్నికైన తొలి పోప్ కూడా ఫ్రాన్సిస్ కావడం విశేషం. క్రీ.శ. 731 నుంచి 741 వరకు చర్చిని నడిపిన సిరియాకు చెందిన గ్రెగొరీ-ఐఐఐ తర్వాత ఈ ఘనత సాధించిన వారు ఆయనే. గొప్ప మానవతావాదిగా పేరొందిన ఆయన మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ సమాజానికి తీరని లోటు అనడంలో సందేహం లేదు.

## విచ్చేసిన జేడీ వాన్స్, ఉషా వాన్స్

ఢిల్లీ, ఏప్రిల్ 21: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబం భారత పర్యటనకు విచ్చేసింది. సోమవారం ఢిల్లీ విమానాశ్రయంలో వాన్స్ దంపతులను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు సాదరంగా ఆహ్వానించారు. తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జేడీ వాన్స్ ప్రధాని మోడీతో భేటీ అవుతారు. పర్యటనలో భాగంగా తన భార్యాపిల్లలతో కలిసి రాజస్థాన్, ఆగ్రాలోని ప్రముఖ ప్రాంతాలను సందర్శిస్తారు. వాన్స్ సతీమణి ఉష చిలుకూరి తెలుగమ్మాయి అన్న సంగతి తెలిసిందే. ఆమె పూర్వీకులు కృష్ణా జిల్లాకు చెందిన వారు. భారత సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిచ్చే ఉషా.. జేడీ వాన్స్ హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. పిల్లల పేర్లను కూడా అలాగే పెట్టారు. ఇప్పుడు కూడా ఆ కుటుంబం సంప్రదాయబద్ధంగానే కనిపించారు. వాన్స్ కుమారులు ఇవాన్, వివేక్ కుర్తా-పైజామా ధరించగా, కుమార్తె మీరాబెల్ అనార్కలీ డ్రెస్ వేసుకున్నారు.

## ముంబైలో మాయే మస్క్

ముంబై, ఏప్రిల్ 21: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తల్లి మాయే మస్క్ భారత్ లో పర్యటిస్తున్నారు. బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తో కలిసి నేడు ఆమె ముంబయిలోని సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆమెతో కలిసి దేవున్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తాను రాసిన పుస్తకం 'ఉమెన్ మేక్స్ ఎ ప్లాన్' హిందీ ఎడిషన్ ను ఆవిష్కరించడానికి మాయే ముంబయి వచ్చినట్లు సమాచారం. ఇటీవల ఆమె తన 77వ పుట్టిన రోజు వేడుకలను ఇక్కడే జరుపుకున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ''ఎ ఉమెన్ మేక్స్ ఎ ప్లాన్'' అనే పుస్తకంలో మాయే తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ప్రస్తావించారు.

## మావోయిస్టు కీలక నేత ప్రయాగ్ మాంఝీతో సహా ఎనిమిది మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని దల్బుద అతడి స్వగ్రామం. ఝార్ఖండ్, బిహార్, ఛత్తీస్ గఢ్, ఒడిశాలో జరిగిన దాదాపు 100 దాడుల్లో మాంఝీ హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50 కేసులతో పాటు రూ.కోటి రివార్డ్ ఉంది. ఝార్ఖండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు మాంఝీ.

సోమవారం తెల్లవారుజామున సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎదురు కాల్పులు మొదలైనాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయారు. మొత్తం 8 మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ వంటి భారీ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. 209 కోబ్రా బెటాలియన్, ఝార్ఖండ్ పోలీసులు దీనిలో పాల్గొన్నారు. ప్రయాగ్ మాంఝీ భార్య జయాను గతేడాది పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సకు చికిత్స తీసుకోవడానికి వచ్చిన సమయంలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

## మేలో ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పనకు ఉపయోపడనుంది. ఇలా మొత్తం ఏడు పరిశోధనలు చేయనున్నారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్ యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామి పంపించనున్నారు. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్లో గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ను ఇస్రో ఇదివరకే ఎంపిక చేసింది. గగన్ యాన్ కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఈయనే అతిపిన్న వయస్కుడు.

## అమెరికాతో డీల్ చేస్తే అంతే సంగతులు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

''చైనా ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటే దాన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని ఎన్నటికీ అంగీకరించబోం. మా నుంచి ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఇతరుల ప్రయోజాలను పణంగా పెట్టి తాత్కాలికంగా, స్వార్థపూరితంగా లాభం పొందాలనుకోవడం.. పులి చర్మం కోసం దాంతోనే డీల్ చేసుకోవడం లాంటిది. దీని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూరదు. స్వల్పకాలిక లాభాల కోసం వెళితే.. అది ఎప్పటికైనా మనకే హాని చేస్తుందన్న విషయాన్ని దేశాలు గుర్తుంచుకోవాలి. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదు. రాజీ పడితే గౌరవం లభించదు'' అని చైనా తమ ప్రకటనలో హెచ్చరించింది.

ఏప్రిల్ 2న ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై భారీ టారిఫ్లు విధించిన ట్రంప్.. వాణిజ్య చర్చల కోసం వాటిని 90 రోజుల పాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే, చైనాకు మాత్రం ఎలాంటి మినహాయింపు లేదని ప్రకటించారు. ఇదే సమయంలో ఆయా దేశాలతో ట్రేడ్ డీల్ కోసం చర్చలు జరుపుతున్న అమెరికా.. వాటిని చైనాపై ఆయుధంగా మార్చుకోవాలని భావిస్తోంది. బీజింగ్‌తో సంబంధాలను తగ్గించుకునేలా ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమైంది. ఇతర దేశాలు చైనా నుంచి దిగుమతులు చేసుకోవద్దని, ఆయా దేశాల్లో బీజింగ్ కంపెనీల ఏర్పాటును కూడా తిరస్కరించాలని షరతు పెట్టనున్నట్లు తెలుస్తోంది.

## గుడ్‌న్యూస్.. ఆ జిల్లా ప్రజల కోరిక నెరవేర్చనున్న కూటమి సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం పంపిణీ చేశారు. గుంటూరు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

**బ్రిడ్జిపై అపోహలు..**

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. కేవలం 6 నెలల వ్యవధిలో శంకర్ విలాస్ బ్రిడ్జి అభివద్ధి పనులకు టెండర్లు పిలిచామని అన్నారు. బ్రిడ్జిపై కొంతమంది అపోహలు కలిగిస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎవరూ అలాంటి అపోహలు నమ్మకుండా వాస్తవాలు ఆలోచించాలని అన్నారు. నష్టపోయిన యజమానులకు సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని తెలిపారు. ముందుగా ఆర్యూబీ కట్టాలంటే మళ్లీ మొదటి నుంచి చేయాలని.. అప్పుడు ఆర్వోబి ఆగిపోతుందన్నారు. భవిష్యత్తులో ఆర్వోబీ కావాలంటే అప్పుడు ఉన్న పరిస్థితికి అనుగుణంగా నిర్మించుకోవచ్చని సూచించారు. బ్రిడ్జి పొడవు పెంచితే వ్యాపారాలు దెబ్బతింటాయని అన్నారు. కూటమి నాయకులు సొంత లాభం కోసం పని చేయడం లేదని.. ప్రజల అభివద్ధి తమకు లక్ష్యమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

**వ్యాపారులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు: గల్లా మాధవి**

శంకర్ విలాస్ పై వంతెన డిమాండ్ చాలా ఏళ్ల నుంచి ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. ఎట్టకేలకు పై వంతెన నిర్మాణం సాకారం కానుందని అన్నారు. ఈ సమయంలో కొందరు అడ్డంకులు సష్టించడం సరికాదని చెప్పారు. వ్యాపారులను రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారి విషయంలో ప్రజలు ఆలోచించాలని చెప్పారు. రెండేళ్ల లోపు పై వంతెన నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు.

**ఆ కేసులు ఉపసంహరించుకోవాలి: రామాంజనేయులు**

ప్రజలకు ఉపయోగపడే వంతెనను అడ్డుకోవడం మంచిది కాదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. కోర్టుకు వెళ్లిన వారు కూడా వంతెన నిర్మాణం కోసం సహకరించాలని కోరారు. లక్షల మందికి ఉపయోగపడే పని జరుగుతున్నప్పుడు వ్యాపారులు సహకరించాలని అన్నారు. పెద్ద ప్రాజెక్టు వచ్చినప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు తప్పవని అన్నారు. భవిష్యత్తులో జరిగే ప్రయోజనం దష్ట్యా పై వంతెనకు సహకరించాలని కోరారు. వంతెన నిర్మాణానికి ముందే పరిహారం, టీడీఆర్ బాండ్లు ఇస్తున్నామని తెలిపారు. కోర్టు కేసులు ఉపసంహరించుకోవాలని వ్యాపారాలకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు.

## జనవాణి పనివేళల్లో మార్పు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ కొత్త సమయాలు సోమవారం నుండి అమలులోకి వస్తాయని.. అందుకు అనుగుణంగా జనసేన జనవాణి సేవలు వినియోగించుకోవాల్సిందిగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది. జనసేన పార్టీ చేపట్టిన జనవాణి కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. వేలాదిమంది ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు తరలివస్తున్నారు.

కాగా గతంలో జనసేన పార్టీ తరపున జనవాణి కార్యక్రమం నిర్వహించిన పవన్ కల్యాణ్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. వివిధ రకాల సమస్యలతో జనవాణికి వచ్చిన ప్రజలను పవన్ కల్యాణ్ కలిసి వారి నుంచి వినతి పత్రాలు తీసుకొని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు. జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కూడా జనవాణి కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తున్నారు. అనంతరం వాటినే అధినేత దష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు.

## జగన్ వ్యవస్థలను భ్రష్టు పట్టించారు.. టీడీపీ ఎంపీ విసుర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి మోదీ సహాయ సహకారాలతో ఈసారి అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిర్ణయిత సమయంలోనే పూర్తి చేస్తామని అన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీకి తీరని నష్టం జరిగిందని విమర్శించారు. ఏపీకి ప్రధాని సహాయ సహకారాలు చాలా అవసరమని చెప్పారు. ప్రధాని అమరావతికి రావడం ద్వారా పెట్టుబడిదారుల్లో, ప్రజల్లో కొత్త శక్తి, ఉత్సాహం వస్తాయని.. తద్వారా ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని ఎంపీ అప్పలనాయుడు పేర్కొన్నారు.

## శ్రీవారిని ఎంతమంది భక్తులు దర్శించుకున్నారో తెలుసా

తిరుమల, ఏప్రిల్ 21: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పరీక్షలు అయిపోవడంతో పాటు వేసవి సెలవులు వచ్చేయడంతో చాలా మంది తిరుమల బాట పట్టారు. దీంతో తిరుమలలో భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఆ గోవిందుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు అధికంగా తరలిరావడంతో శ్రీవారి దర్శనానికి గంటల సమయం పడుతోంది. శ్రీవారిని దర్శించుకునేందుకు దాదాపు ఏడు కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనం కోసం దాదాపు 12 గంటల సమయం పడుతోంది. అలాగే వేసవి సెలవుల్లో శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉండనుంది. ఇక నిన్న వారాంతం కావడంతో తిరుమల శ్రీవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దాదాపు 25,078 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే శ్రీవారికి తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.85కోట్ల ఆదాయం వచ్చింది.

**ఉదయం సేవలు:**

ఈరోజు (సోమవారం) తెల్లవారుజాము నుంచే తిరుమలేశుడికి పలు సేవలు నిర్వహించారు అర్చకులు. సుప్రభాత సేవ, తోమాల సేవ, ఏకాంత సేవ, తొలి అర్చన, సహస్ర నామ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవారికి విశేష పూజ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి శ్రీవారిని దర్శించుకునేందుకు అనుమతి ఇచ్చారు. రాత్రి ఏడు గంటల వరకు గోవిందుడిని దర్శించుకోవచ్చు. ఇక మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళ్యాణోత్సవం, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, ఉంజల్ సేవలు నిర్వహించనున్నారు.

## రూ.28 వేల కోట్లతో ట్రాన్స్‌కో నెట్‌వర్క్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి వచ్చే విద్యుత్‌ను వాడుకునేందుకు నెట్‌వర్క్‌ను అభివద్ధి చేయాల్సి ఉంది. భావి అవసరాల దష్ట్యా లైన్ల సామర్థ్యం పెంపునకు రూ.28 వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టు చేపట్టబోతున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో 60-80% నిధులు సర్దుబాటు చేయాలని కోరింది. దీనికి అనుమతులు వస్తే, పూర్తి చేసేందుకు కనీసం ఐదేళ్లు పడుతుందని అంచనా.

**ఐదేళ్లలో.. 20 వేల మెగావాట్లకు డిమాండ్**

హరిత ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో గ్రీన్ ఎనర్జీ కారిడార్ పథకం కింద నెట్‌వర్క్ విస్తరణకు కేంద్రం నిధులిస్తోంది. ఈ పథకం మొదటి దశలో భాగంగా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో చేపట్టిన ప్రత్యేక లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తి కావొచ్చాయి. రెండో దశలోని పనులు కూడా పూర్తయితే ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ పటిష్ఠమవుతుంది. తద్వారా రాయలసీమ, కోస్తాల మధ్య నెట్‌వర్క్ అనుసంధానానికి మార్గం ఏర్పడుతుంది.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పీజీసీఐఎల్ నెట్‌వర్క్‌పై ఆధారపడాల్సి వస్తోంది. సుమారు 8 వేల మెగావాట్ల విద్యుత్‌ను డిస్‌ప్లేస్‌మెంట్ విధానంలో పీజీసీఐఎల్ నెట్‌వర్క్‌కు కలపగా, ఆ విద్యుత్ తమిళనాడుకు వెళ్తోంది. దీనికి బదులు ఎగువ నుంచి వచ్చే విద్యుత్‌ను విశాఖ దగ్గర నెట్‌వర్క్ ద్వారా విద్యుత్ సంస్థలు తీసుకుంటున్నాయి.

2030-32 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా. ఏడాదికి విద్యుత్ వినియోగం 1.20 లక్షల మిలియన్ యూనిట్లకు చేరే అవకాశముంది. అప్పటికి నెట్‌వర్క్ విస్తరించకుంటే ఇబ్బందులు పెరగనున్నాయి.

ప్రస్తుతం పీజీసీఐఎల్ నెట్‌వర్క్ వాడుకుంటున్నందుకు ఏటా సుమారు రూ.1,700 కోట్ల ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను విద్యుత్ సంస్థలు చెల్లిస్తున్నాయి. ఇప్పటికే పీజీసీఐఎల్ నెట్‌వర్క్ సామర్థ్యం మించింది. భవిష్యత్తులో పెరిగే విద్యుత్‌కు కేంద్ర నెట్‌వర్క్ వినియోగించుకుంటే ఆల్టర్నేటివ్ కరెంట్ (ఏసీ) ఛార్జీల భారం అదనంగా పడనుంది. ఈ దష్ట్యా నెట్‌వర్క్ విస్తరణ అవసరమని అధికారులు నిర్ణయించారు.

**భారీ ప్రాజెక్టుల అవసరాలు తీరేలా**

కాకినాడ సెజ్, తూర్పుగోదావరి జిల్లా వేమగిరి దగ్గర 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి సత్తెనపల్లిలోని సబ్‌స్టేషన్ వరకు నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. అక్కడి నుంచి గుడివాడకు, ఆపై రామాయపట్నానికి విస్తరించాలన్నది అధికారుల ఆలోచన. రామాయపట్నంలో కొత్తగా పోర్టుతో పాటు బీపీసీఎల్ చమురు శుద్ధి కర్మాగారం, ఇండోసోల్ వంటి భారీ ప్రాజెక్టులు రాబోతున్నాయి. వాటి విద్యుత్ అవసరాలు తీర్చడానికి నెట్‌వర్క్ అవసరం ఉంటుంది. రామాయపట్నం నుంచి అనంతపురం జిల్లాలోని నెట్‌వర్క్‌ను కలపనున్నారు. దీనివల్ల శ్రీకాకుళం జిల్లా మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు ట్రాన్స్‌కో నెట్‌వర్క్‌కు అనుసంధానమవుతాయి. రాయలసీమలోని ప్రాజెక్టుల నుంచి వచ్చే విద్యుత్‌ను రాష్ట్రంలో అవసరమైన చోటుకు తరలించే వీలుంటుంది.

కాకినాడ నుంచి విశాఖపట్నం, విజయనగరం జిల్లాలను కలుపుతూ ఇప్పటికే ట్రాన్స్‌కో నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. హిందుజా-గుడ్డిగూడెం మధ్య 400 కేవీ లైన్ ఉండగా, గుడ్డిగూడెం దగ్గర సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. దాన్నుంచి కాకినాడ సెజ్ దగ్గర లూప్ ఇన్ లూప్ అవుట్ (లిలో) ద్వారా కలుపుతారు. కల్పాక నుంచి విజయనగరంలోని మరడం 400 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానముంది.

# మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం - ఏఐటీయూసీ

- లేబర్ కోడ్ ల రద్దుకై - ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం
- ఆప్కాస్ అమలు - కార్మిక సంక్షేమం - అసంఘటితరంగ కార్మిక సంక్షేమ బోర్డు సాధన ఉద్యమం

**తిరుపతి, ఏప్రిల్ 21 మనం న్యూస్ :** తిరుపతి నగరంలో స్ట్రీట్ వెండర్స్ సమావేశం బైరాగి పట్టెడ లో గల ఏఐటియుసి నగర కార్యాలయంలోజరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్ డి రవి ముఖ్య అతిది గా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 1886 లో కార్మిక వర్గ చరిత్రను అమెరికాలోని చికాగో నగరం లో కార్మిక తిరుగుబాటు మలుపు తిప్పింది కార్మిక వీరులను ఉరితీసి ఉద్యమాన్ని అణచివేయాలని పెట్టుబడిదారుల కుట్రలు వీగిపోయింది ప్రపంచమంతా ఈ అగ్ని దావానౌ లా వ్యాపించి పెట్టుబడిదారులు తల వంచి రోజుకు 8 గంటల పని విధానం పై చట్టాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది 1886లో చికాగో మహానగరంలో హే మార్కెట్ వద్ద జరిగిన అల్లర్ల లో జరిగిన కాల్పుల లో మరణించిన కార్మికులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది మే 1వ తేదీన కార్మికుల దీక్షా దినం మే డే గా ప్రతి ఏడాది జరుపుకోవాలని 1890 లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ తీర్మానించిందణి . 1920- అక్టోబర్ 31న భారతదేశంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటు జరిగింది.

1923 లో భారతదేశంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై మహానగరంలో మొదటి మేడేని జరుపుకోవడం ప్రారంభించామని అప్పటినుండి కార్మిక సంఘాలన్నింటినీ సమీకరించి కార్మిక వర్గానికి బ్రిటిష్ కాలంలో పోరాడి కొన్ని చట్టాలను చేయడం జరిగిందని స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల అమలు కోసం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత ఏఐటియుసి ది అని అయన అన్నారు.

140 సంవత్సరాల తర్వాత బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను. హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కొత్తగా కార్మిక లేబర్ కోడ్ లను తీసుకురావడం జరిగింది. ఈ లేబర్ కోడ్ ల అమలు వల్ల సంగం పెట్టుకునే హక్కు కోల్పోతాము 8 గంటల పని విధానం రద్దు అవుతుంది ఇప్పటికే ఎల్ టి చైర్మన్ సుబ్రహ్మణ్యన్ రోజుకు 15 గంటలు పని చేయాలని ఇంట్లో ఆదివారం పెళ్లాలతో కబుర్లు చెప్పుకోవలా అంటూ కార్మిక వర్గాన్ని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు ఇప్పటికే చెన్నైలోని శ్యాంసంగ్ కంపెనీలో




కార్మికులపై ఏస్మాను ప్రయోగించి సమ్మె చేసినందుకు జీతాలు కట్ చేసి నాయకులను జైల్ పాలు చేశారు.

లేబర్ కోడ్ లు అమలు అయితే కార్మిక హక్కులు పోతాయి 8 గంటల పని విధానం పోతుంది కార్మిక చట్టాలు అమలు కావు అందుకే మే డే స్ఫూర్తితో 8 గంటల పని విధానం అమలు కోసం లేబర్ కోడ్ లు అమలు కాకుండా అడ్డుకోవడం కోసం కార్మిక చట్టాలు కాపాడుకోవడం కోసం కార్మిక వర్గాన్ని కదిలిద్దాం పోరాటాలకు సన్నద్ధం చేయడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని కదిలించడం కోసం జరిగే మే 5వ తేదీన మే 20వ తేదీన జరిగే కార్యక్రమాల్లో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి అని అలాగే 139వ మేడే ని తిరుపతి జిల్లాలో ప్రతి ప్రాంతంలో సెంటర్లలో దిగ్విజయంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిజ్ఞ చేయాలని వారు పిలుపునిచ్చారు .

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై 139 వ మే డే పురస్కరించుకుని స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో కార్మిక శ్రామిక వర్గాన్ని కదిలించి పోరాడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అందుకోసం కార్మిక వర్గాన్ని ఏఐటియుసి ఎర్రజెండా ఆధ్వర్యంలో సమీకరణకు పూనుకోవాలని ప్రజలను చైతన్యవంతం చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి అని ఆయన అన్నారు.

**ఇంకా ఈ కార్యక్రమంలో**

ఏఐటియుసి తిరుపతి నగర అధ్యక్షులు కేవై రాజా వీధి వర్తక వ్యాపార సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ శివకుమార్ ఆఫీస్ బేరర్స్... శ్రీనివాసులు వెంకటేష్ సురేష్ గురవయ్య విజయ్.. తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే

- తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు

**తిరుపతి, ఏప్రిల్ 21 మనం న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఎన్నో ప్రోత్సాహాలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని సంబంధిత తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తుకు అండగా ఉండాలని తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక బైరాగిపట్టెడ నందు ఎంజీఎం



హైస్కూల్ నందు విద్యాశాఖ మరియు సర్వ శిక్షా అభియాన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సహాయ ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సుమారు 3600 మంది ఉన్నారని, వారి భవిష్యత్తు కోసం కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ప్రతి మండలంలో ఒక భవిత పాఠశాలు కలవని, మొత్తం 34 భవిత పాఠశాలలో ఉన్నాయని అన్నారు. ఈ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సాధారణ విద్యార్థులు లాగా విద్యను అభ్యసించే అవకాశం ఉండదు కనుక అలాంటి విద్యార్థుల కోసం భవిత పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిత పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఉపకరణాలు , పరికరాలు తో పాటు టీచర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈరోజు 421 మందికి ట్రై సైకిల్స్ , హీరింగ్ కిట్స్ విల్ చైర్స్ , రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్ వంటి పరికరాలను అందించడం జరిగిందినీ, మిగిలిన ఉపకరణాలు కూడా త్వరలో అందిస్తామని తెలిపారు. గతంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రవాణా ఖర్చులకోసం నెలకు రూ.3000 ఉండేదని ప్రస్తుతం రూ .6000 విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సొంతంగా పాఠశాలలకు వెళ్ళలేని పిల్లల కోసం ఎస్కార్ట్ ద్వారా వెళ్లే పిల్లలకు కూడా నెలకు రూ.6000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆడపిల్లల కోసం నెలకు ఇచ్చే రూ. 6000 రూపాయలు కాకుండా ప్రత్యేక స్టైఫండ్ అలవెన్స్ కింద అదనంగా రూ. 2000 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. భవిత పాఠశాలలకు వెళ్ళలేని పరిస్థితిలో ఉన్న పిల్లల కూడా ఇంటి దగ్గరే పాటలు చెప్పడం జరుగుతుందని వారికి కూడా నెలకి రూ. 3000 ఇస్తున్నారని అన్నారు. మిగతా పిల్లలు లాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు వెళ్ళగలరని తల్లిదండ్రులు వారి పిల్లలకి అండగా ఉండి వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రోత్సహించాలని అన్నారు. ఇలాంటి పిల్లల కోసం తల్లిదండ్రులతోపాటు రాష్ట్ర ప్రభుత్వా కూడా అండగా ఉంటుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ కేటగిరీ కింద పెన్షన్లు అందిస్తున్నామని, అలాగే పరికరాల కూడా అందించడం వలన సమాజంలో మిగతా పిల్లలు లాగా గుర్తింపబడతారని తెలిపారు.

ఎంఎల్ఏ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జిల్లా సమగ్ర శిక్ష సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో ఈ రోజు 421 మందికి ట్రై సైకిల్స్, మోటార్ సైకిల్, హియరింగ్ కిట్స్, బ్రెయిలీ కిట్స్ తదితర ఉపకరణాలను ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ అభివృద్ధి కోసం ముందు చూపుతో విద్యాశాఖ లో పెనుమార్పులు తీసుకొని వచ్చి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూన్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాఠశాలకు వెళ్ళి విద్యను అభ్యసించలేని వారి కోసం ఇంటి దగ్గర నుంచి పాఠాలు నేర్పించి వారి తల్లిదండ్రుల సహాయంతో వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే తో కలిసి జిల్లా కలెక్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపకరణాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి బాలాజీ, ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం ముని శారద, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపే కూటమి ప్రభుత్వం

- మాట నిలబెట్టుకున్న ఏపి.సియం చంద్రబాబు
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**చిత్తూరు, ఏప్రిల్ 21 మనం న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం.., మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి.., నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు సిద్దమైందనీ..ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు.

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా.. కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సి నోటిఫికేషన్ను విడుదల చేసింది..ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీను నిలబెట్టుకున్న రాష్ట్ర



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని సోమవారం

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో అభినందినలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రకాల అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. మరీ ముఖ్యంగా నిరుపేదలు లేని సమాజ స్థాపనే ఆయన లక్ష్యమని చెప్పారు. అదేసమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టి.., తాజాగా మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి..,16347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి కంకణం కట్టుకోవడం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రశంసించారు. ఇకపోతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.., విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు.. ఇందులో కీలక పాత్ర పోషించి.., రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమన్నారాయన. 2047 విజన్ తో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజా దీవెనలు మెండుగా ఉన్నాయన్నారు.

## విశాఖ శారదా పీఠానికి టిటిడి నోటీసులు..

- మఠం భవనాన్ని ఖాళీ చేసి అప్పగించాలని నోటీసులు..
- న్యాయస్థానం అనుకూల తీర్పుతో టిటిడి చర్యలు....



**తిరుమల, ఏప్రిల్21, మనం న్యూస్:** తిరుమలలోని విశాఖ శారదా పీఠం భవనాన్ని తమకు అప్పగించాలని మఠానికి నోటీసులిచ్చింది టిటిడి. తిరుమల గోగర్భం డ్యామ్ సమీపంలో ఉన్న విశాఖ శ్రీశారదా పీఠం భవనం ముందు, వెనుక నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారు.. అయినా గత వైసిపి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆక్రమణలను క్రమబద్ధీకరించింది. దీనిపై ప్రజాసంఘాలు, హిందూ ధర్మ పరిరక్షణ సంఘాలు మఠం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. అయితే ఏపిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టింది.

ఇందులో బాగంగా విశాఖ శారదా పీఠం మఠం భవన నిర్మాణంలో ఆక్రమణలు, అవకతవకలు జరిగినట్లు టిటిడి అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా, తిరుమలలో శారదా పీఠం ఆక్రమణలను తొలగిస్తామని టిటిడి పాలక మండలి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో టిటిడి ఎస్టేట్ విభాగం అధికారులు విశాఖ శారదా పీఠానికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా మఠం నిర్వాహకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిబంధనలను మఠం ఉల్లంఘించిందని న్యాయస్థానం గుర్తించడంతోపాటు మఠంపై చర్యలు తీసుకునే అధికారం టిటిడికి ఉందని న్యాయస్థానం టిటిడి కి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో 15 రోజుల్లోపు మఠాన్ని ఖాళీ చేసి భవనాన్ని అప్పగించాలని టిటిడి ఎస్టేట్ విభాగం నోటీసు జారీ చేసింది...

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

**తిరుమల,ఏప్రిల్ 21, మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని భారతదేశ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సభ్యులతో కలిసి



సోమవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయం మహాద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సీ.హెచ్ వెంకయ్య చౌదరి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారి ఆలయానికి ఎదురుగా ఉన్న అఖిలాండం వద్దకు చేరుకుని స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించి పూజలు చేశారు. సమీపంలోని బేడి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు.

## ఆరేళ్ల కల సీఎం చంద్రబాబుతో సాకారం

- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు
- తిరుపతిలో డీఎస్సీ విడుదల సందర్భంగా కృతజ్ఞతలు తెలిపిన డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు
- చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**తిరుపతి, ఏప్రిల్ 21 మనం న్యూస్ :** డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సాకారం చేశారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకుందన్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్డీఓ ఆఫీసు ఎదుట డీఎస్సీ విడుదల సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి చంద్రబాబు, లోకేష్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ

వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సర్, లోకేష్ అన్న అంటూ ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో అభ్యర్థులతో కలిసి అనేక నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలులేవన్నారు. అభ్యర్థులు ఆర్తనాదాలు పెట్టినా స్పందించలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు, లోకేష్ లు నెరవేర్చి అభ్యర్థులకు అండగా నిలిచారన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా డీఎస్సీ రూపొందించారన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ




విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని, అన్న విధంగానే సంవత్సరంలోనే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆరేళ్లుగా నిరీక్షించి అలసిపోయిన అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకున్న శ్రీనివాసరాజు



**తిరుమల,ఏప్రిల్ 21,మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో దాదాపుగా ఎనిమిది సంవత్సరాల కాలం పాటు టీటీడీ సంయుక్త కార్య నిర్వహణ అధికారిగా పనిచేసి ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల ప్రభుత్వ సలహాదారుడిగా పనిచేస్తున్న కే.ఎస్ శ్రీనివాసరాజు సోమవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణ పెండింగ్ పనులను త్వరలో పూర్తి

- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి, ఏప్రిల్ 21 మనం న్యూస్ :** వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ లోని సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , సంబంధిత అధికారులతో కలిసి వైజాగ్ చెన్నైఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో భాగమైన పలు ఇండస్ట్రియల్ కారిడార్ కు సంబంధించిన భూసేకరణ పనులు, రోడ్లు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, ఏపీఐఐసీ , ఆర్ అండ్ బి శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు అభివృద్ధి పనులకు సంబంధించిన సంబంధించి నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాలలో భూ సేకరణ పెండింగ్, రోడ్లు పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మధుసూదన్ రావు, సంబంధిత మండలాల తాసిల్దారు , తదితరులు పాల్గొన్నారు.



## పుడమి తల్లికి ఒళ్లంతా గాయాలు...!!

ఎత్తయిన పర్వతాల సుందర రూపంతో
అందమైన నడకల నదుల సోయగం తో
విశాలమైన వక్షస్థల మైదానాలతో
చూడ చక్కని సుందర శిల్ప లావణ్యమైన
నేలతల్లి..
నేడు పుడమి తల్లికి ఒళ్లంతా గాయాలు
కాలుష్యపు క్యాన్సర్ తో సతమతమవుతూ
స్వచ్ఛమైన గాలి లేక వెంటిలేటర్ పై జీవిస్తుంది
మనిషి పెట్టిన విషం తిని అలమటిస్తుంది..

ప్రాణులకు స్తన్యం ఇచ్చినటువంటి తల్లి
ఎదపై పుండ్లతో నిత్యం బాధపడుతూ
సహజత్వం కోల్పోయి కురూపి గా మారెను
అందమైన అమ్మ ఆకారం కళ హీనంగా
తయారయ్యే..
ఎన్నో జీవులకు గర్భం ఇచ్చిన మాతృమూర్తి
వారి పోషణకై నిరంతరము తపించిన కన్నతల్లి
అణు విస్ఫోటాలతో తల్లడిల్లుతుంది
ఆకలికి ఆహారం కరువై విలవిలలాడుతుంది...

పుడమి కనక గర్భము తో తులతూగుతుంటే
ఆశపరులు త్రవ్వి ధనము పోగు చేస్తుంటే
తనువంతా చిల్లులు పడి సతాయిస్తుంటే
నిత్యం మౌనంగా మూగ రోదన చేస్తూ
జీవిస్తుంది..
విశ్వంలో అందమైన అపురూపం నా భూగ్రహం
నేడు అనాథలా తయారై తిరుగుతుంది
అందులో పుట్టి ప్రత్యామ్నాయం చూస్తున్నాం
నేడు మనుగడ కోసం ప్రకృతిని ఆశిస్తున్నాం...

దాహం అంటే నీరు ఇస్తుంది జీవులకు
ఆకలంటే అన్నం పెడుతుంది సర్వప్రాణులకు
సచ్చే వరకు మోసి తనలోనే కలుపుకుంటుంది
ఏమిచ్చి తీర్చుకోగలం ఈ నేల తల్లి రుణం....
చిన్న మొక్క నాటి ప్రేమగా పలకరించండి
ఆనందంగా మొక్క నాటి అపురూపంగా పెంచండి
స్వచ్ఛమైన గాలిని పుడమి తల్లికి అందించండి
నేల తల్లికి బలం చేకూర్చే వనాన్ని
సమకూర్చండి..

**- కొప్పుల ప్రసాద్**
9885066235

# భూగ్రహ రక్షణ మనందరి తక్షణ బాధ్యత



ప్రపంచ ధరిత్రి దినోత్సవం పర్యావరణ పరిరక్షణకు మద్దతును ప్రదర్శించడానికి ఏప్రిల్ 22న జరిగే ప్రపంచ వార్షిక కార్యక్రమం. ఇది మొదటిసారి ఏప్రిల్ 22, 1970న నిర్వహించబడింది, ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా (earthday.org) ద్వారా 193 కంటే ఎక్కువ దేశాల్లోని 1 బిలియన్ మంది వ్యక్తులతో సహా అనేక రకాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. 1969లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన యునెస్కో (UNESCO) సమావేశంలో, శాంతి కార్యకర్త జాన్ మెక్కానెల్ భూమిని, శాంతి భావనను గౌరవించే రోజును ప్రతిపాదించాడు. దీనిని మొదట మార్చి 21, 1970న, ఉత్తర అర్ధ గోళంలో వసంతకాలం మొదటి రోజున పాటించాలని ప్రతిపాదించారు. ఐక్యరాజ్యసమితిలో సెక్రటరీ జనరల్ యు థాంట్ సంతకం చేసారు. ఒక నెల తర్వాత, యునైటెడ్ స్టేట్స్ సెనేటర్ గేలార్డ్ నెల్సన్ ఏప్రిల్ 22, 1970న దేశవ్యాప్త పర్యావరణ బోధనను నిర్వహించాలనే ఆలోచనను ప్రతిపాదించారు. నెల్సన్ మరియు హేస్ ఈ కార్యక్రమంకి ధరిత్రి దినోత్సవం (ఎర్త్ డే) అని పేరు పెట్టారు. 2025 ప్రపంచ భూమి దినోత్సవం యొక్క అధికారిక సారాంశం 'మన శక్తి, మన గ్రహం'. ఇది పునరుత్పాదక శక్తికి మారడం, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం అనే సమిష్టి బాధ్యతపై దృష్టి పెడుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక శక్తి మొత్తాన్ని మూడు రెట్లు పెంచడం, ముఖ్యంగా సౌర, పవన భూఉష్ణ వంటి శుభ్రమైన వనరులను నొక్కి చెప్పడం ముఖ్య లక్ష్యం.

జీవుల మనుగడకు అనుకూలమైన గ్రహం భూమి. కానీ అది చాలా సమస్యలను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల కారణంగా నాసా (NASA) ప్రకారం, భూమిపై గ్లోబల్ వార్మింగ్ సగటు ఉపరితల ఉష్ణోగ్రత 59 డిగ్రీల ఫారెన్హీట్ (15 డిగ్రీల సెల్సియస్) వద్ద ఉంది. గాలి, నీరు, నేల, ధ్వని కాలుష్యాలు పెరుగుతున్నాయి. 1970 నుండి జీవవైవిధ్య నష్టం 73% గా ఉంది. సంవత్సరానికి 10 మిలియన్ హెక్టార్లలో అటవీ నిర్మూలన జరుగుతోంది. పెరుగుతున్న మానవ జనాభా, పెరుగుతున్న వినియోగం సహజ వనరులపై అపారమైన ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది నీటి కొరత, ఆహార అభద్రత, ఆవాసాల నాశనానికి దారితీస్తుంది. మరోవైపు, ప్లాస్టిక్ల ఉత్పత్తి, పారవేయడం మహా సముద్రాలు, పల్లపు ప్రాంతాలు, పర్యావరణ వ్యవస్థలలో కాలుష్యానికి, వన్యప్రాణులకు, ఆహార గొలుసులకు అంతరాయం కలిగిస్తుంది. 1970ల చివరి నుండి, ఓజోన్ స్థాయిలు సగటున 4% తగ్గాయి. ప్రపంచవ్యాప్తంగా, జనాభాలో గణనీయమైన భాగం నీటి కొరతను అనుభవిస్తోంది. దాదాపు 25% మంది నీటి ఒత్తిడి, కొరతను ఎదుర్కొంటున్నారు. 2025 నాటికి, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది నీటి కొరతను ఎదుర్కొంటారని అంచనా.ఈ సమస్యలు పర్యావరణం మాత్రమే కాదు, సామాజిక, ఆర్థిక పరిణామాలను కూడా కలిగి ఉన్నాయి, దీనికి ప్రపంచ సహకారం, స్థిరమైన పరిష్కారాలు అవసరం.

ప్రపంచ దేశాలు స్థిరమైన అభివృద్ధి, వాతావరణ చర్య మరియు ప్రపంచ సహకారం వంటి అంశాలపై దృష్టి సారించి అనేక కార్యక్రమాలు శిఖరాగ్ర సమావేశాలను అమలు చేస్తున్నాయి. ఈ చొరవలు ప్రపంచవ్యాప్త సవాళ్లను ఎదుర్కోవడం అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఐక్యరాజ్యసమితి అనేక కార్యక్రమాలు శిఖరాగ్ర సమావేశాలను మెరుగైన వర్తమానాన్ని అందించడం, భవిష్యత్తును కాపాడటంపై కొత్త అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకున్న ఉన్నత స్థాయి కార్యక్రమం ప్రారంభించింది.. 2030 ఎజెండా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు యొక్క తదుపరి, సమీక్ష కోసం మహమ్మారి వల్ల కలిగే అభ్యాస నష్టాలను పరిష్కరించడానికి భవిష్యత్తు కోసం విద్యను తిరిగి ఊహించుకోవడానికి ఉన్నత స్థాయి కార్యక్రమం ప్రారంభించింది. క్యోటో ప్రోటోకాల్ ఆరు గ్రీన్హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) దేశాలు వాతావరణ స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ప్రకృతితో సామరస్యంగా జీవించడానికి కాలుష్య రహిత భవిష్యత్తులను సాధించడానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు మద్దతు ఇవ్వడానికి సహాయపడతాయి. ప్రైవేట్ రంగం స్థిరమైన పద్ధతులు పునరుత్పాదక శక్తిలో ఎక్కువగా పెట్టుబడి పెడుతోంది, పౌర సమాజం, ప్రభుత్వేతర సంస్థలు అవగాహన పెంచడంలో పర్యావరణ చొరవలకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. యునైటెడ్ కింగ్డమ్, నార్వే, ఫ్రాన్స్ న్యూజిలాండ్ 2050 నాటికి నికర సున్నా ఉద్గారాలను చేరుకోవడానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉన్న కొన్ని దేశాలు. అయినప్పటికీ, మెజారిటీ దేశాలు వాటి రాజకీయ ఆర్థిక ప్రభావాల కారణంగా భూగ్రహాన్ని రక్షించడానికి ఆసక్తి చూపడం లేదు.



భారత ప్రభుత్వం గ్రహాన్ని రక్షించడానికి వివిధ చర్యలను అమలు చేసింది, వాటిలో పునరుత్పాదక శక్తిపై దృష్టి పెట్టడం, వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం, వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ఉన్నాయి. అదనంగా, శిలాజేతర ఇంధన విద్యుత్ ఉత్పత్తికి లక్ష్యాలను పెంచడానికి ఉద్గార తీవ్రతను తగ్గించడానికి ప్రభుత్వం దాని జాతీయంగా నిర్ణయించిన సహకారాలను (ఎన్డిసి) నవీకరించింది.

2008లో ప్రారంభించబడిన నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ చేంజ్ ప్రణాళిక, నేషనల్ సోలార్ మిషన్, నేషనల్ మిషన్ ఫర్ ఎన్హాన్స్డ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ, నేషనల్ మిషన్ ఫర్ ఎ గ్రీన్ ఇండియాతో సహా ఎనిమిది జాతీయ మిషన్లను వివరిస్తుంది. 2030 నాటికి శిలాజేతర ఇంధన ఉత్పత్తికి తన నిబద్ధతను 50%కి పెంచడానికి, 2005 స్థాయిలతో పోలిస్తే ఉద్గార తీవ్రతను 45% తగ్గించడానికి భారతదేశం తన జాతీయంగా నిర్ణయించిన సహకారాలను లను నవీకరించింది, 2030 నాటికి 2.5-3 బిలియన్ టన్నుల కార్బన్ సింకు లక్ష్యంగా చేసుకుంది. భారతదేశం 2030 నాటికి 450 గిగావాట్ పునరుత్పాదక శక్తిని లక్ష్యంగా చేసుకుంది.

దేశవ్యాప్తంగా వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి సమగ్ర ప్రణాళికగా ప్రభుత్వం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. వాహన ఉద్గారాలను తగ్గించడానికి భారతదేశం బిఎస్-IV నుండి బిఎస్-VI ఇంధన ప్రమాణాలకు ఒక పెద్ద ముందడుగు వేసింది.

కంప్రెస్డ్ బయో-గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల నుండి ఫ్లై యాష్ యొక్క సరైన వినియోగాన్ని నిర్ధారించడానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఫ్లై యాష్ వినియోగ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసింది.

భూమిని సమర్థవంతంగా రక్షించడానికి, వ్యక్తిగత చర్యలు, ప్రభుత్వ విధానాలు మరియు ప్రపంచ సహకారాన్ని కలిగి ఉన్న బహుముఖ విధానం అవసరం.

మన కార్బన్ పాదముద్రను తగ్గించడం, నీరు శక్తి వంటి వనరులను పరిరక్షించడం, వ్యవసాయం పరిశ్రమలలో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, అంతర్జాతీయ ఒప్పందాలు, సాంకేతిక పురోగతి ద్వారా వాతావరణ మార్పులను పరిష్కరించడం వంటి ముఖ్యమైన చర్యలు ఉన్నాయి. ఈ ప్రపంచానికి అవసరమైన భూ రక్షణ చర్యల కోసం కఠినమైన అమలుతో కూడిన ప్రణాళికాబద్ధమైన దీర్ఘకాలిక వ్యూహంలలో దేశాలు విశాల దృక్పథంతో ఉండాలి.

**(నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం)**

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# యంగ్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ తెలంగాణ




మన బలాలను తెలుసుకొని ముందడుగు వేయడం, బలహీనతలకు చికిత్సలు ఆలోచించడం విజ్ఞులు చేసే పని. నేటి భారతావని అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ సరైన సమాధానాలు వెతకడంతో పాటు మన బలాలను గుర్తించి సుస్థిరాభివృద్ధి దిశగా మలుచు కోవడం వివేకుల ఆలోచనలు అవుతాయి. 144 కోట్ల జనాభా మనకు వరమా, శాపమా ! అని చర్చించుకుంటున్న వేళ మన జనాభా సగటు వయస్సు 28.8 సంవత్సరాలు నమోదు కావడం శుభ పరిణామంగా తీసుకోవాలి. అపార మానవ వనరుల సగటు వయస్సు 28.8 ఏండ్లు అయినపుడు, భారతావని నిండా యువశక్తి ప్రవాహం కొనసాగుతున్నది, యువ భారత్ అంటూ సగర్వంగా పిలువబడుతున్నది. దేశ జనాభాలో 15 - 29 ఏండ్ల వయస్సు ఉన్న యువత 42 కోట్లు ఉండడంతో పాటు 35 ఏండ్ల లోపు వయస్సు ఉన్న జనాభా 65 శాతం ఉండడం మన దేశ అమూల్య వనరులుగా భావించాలి. దేశ జనాభా సగటు వయస్సులో జపాన్ 50 ఏండ్లు, అమెరికా 38.7 ఏండ్లు ఉండడం ఆయా దేశాల అధిక వయోవృద్ధుల జనాభాను సూచిస్తున్నది. వృద్ధ జపాన్ లాంటి పదాలను ఉపయోగించాల్సిన స్థితి వస్తున్నది.

**యంగ్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్గా తెలంగాణ**

28వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ 11వ అతి పెద్ద, 12వ అతి పెద్ద జనాభా, జిడిపీలో 8వ ర్యాంకు కలిగిన రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నది. తెలంగాణ జనాభా దాదాపు 3.5 కోట్లు ఉండడం, ఇందులో దాదాపు 2.4 కోట్ల జనాభా యువత 15 - 40 ఏండ్లు ఉండడం, ఉన్నత విద్యలో నమోదు నిష్పత్తి (జిఈఆర్) 28.4 శాతం ఉండడం, యువ జనాభా అధికంగా ఉన్న తెలంగాణలో ఉన్నత విద్యా సంస్థలు ఎక్కువగా ఉండడంతో మన యువత విద్యతో పాటు నైపుణ్యాలను ఒడిసి పట్టుకొని గౌరవప్రద ఉద్యోగ ఉపాధులను పొందితే నేటి తెలంగాణ రేపటి భారతానికి యంగ్ ఇండియా అంబాసిడర్గా మారబోతుందనడంలో అతిశయోక్తి లేదు.ప్రస్తుతం తెలంగాణలో 1,446 కళాశాల్లో 4.58 లక్షల యువత ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 388 ఇంజనీరింగ్ కళాశాలలు, 62 ప్రభుత్వ/ప్రైవేట్ మెడికల్ కళాశాలలు తెలంగాణ యువతకు విద్య, నైపుణ్యాలను బోధించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

**యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ స్థాపన**

ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు యంగ్ ఇండియా నినాదం తీసుకొని యువతకు విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించే దిశగా పలు వాంఛనీయ చర్యలను తీసుకోవడం సముచితంగా ఉన్నది. ఇదే క్రమంలో ఇటీవల దేశంలోనే ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని 15 బహుళజాతి కంపెనీల భాగస్వామ్యంతో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) ప్రాతిపదికన ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. తొలి బ్యాచ్‌గా 9 కోర్సులను ప్రారంభించి 212 మంది విద్యార్థినీవిద్యార్థులను ఎంపిక చేసి నైపుణ్య వికాస శిక్షణను ఇవ్వడం కొనసాగుతున్నది. నేడు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఫార్మసీ, ఈ-కామర్స్ లాజిస్టిక్స్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్స్ట్రక్షన్, రిటేల్



ఆపరేషన్స్ అండ్ మేనేజ్ మెంట్ , ఆనిమేషన్, విజ్వువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్, వేర్హౌజ్ ఎగ్జిక్యూటివ్స్, కీ కన్సైనర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులను అందిస్తున్నది. రానున్న రోజుల్లో నర్సింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మా అసోసియేట్ కోర్సులను కూడా ప్రారం భించనున్నది. ఈ కోర్సులు పూర్తి చేసిన యువతకు ఆయా భాగస్వామ్య కంపెనీలు ఉద్యోగ నియామకాలను చెపట్టనున్నది. నేటి తెలంగాణ యువతకు ఇదొక అపూర్వ ఉద్యోగాలు అందించే అక్షయ పాత్రగా యంగ్ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మారుతున్నదని నమ్మాలి.

**యంగ్ ఇండియా ఫిజికల్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపన**

ఫిజికల్ ఎడ్యుకేషన్ నినాదం హెల్దీ మైండ్ ఇన్ హెల్దీ బాడీ (ఆరోగ్యకర దేహంలో ఆరోగ్యకర మెదడు) నేటి యువతకు శారీరక ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నది.

5.18 కోట్ల జనాభా కలిగిన దక్షిణ కొరియాకు 2024 ఒలంపిక్స్‌లో 32 పతకాలు గెలవడం, 12.37 కోట్ల జనాభా కలిగిన జపాన్ 45 పతకాలు చెజిక్కించుకోగా, 140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌కు 6 పతకాలు మాత్రమే రావడం విచారకరం. యువ భారత దృష్టిని క్రీడల వైపు మరల్చుతూ రానున్న ఒలంపిక్స్‌లో భారత జట్టు తరపున అధిక మొత్తంలో పతకాలు సాధించుటలో తెలంగాణ యువత ముందు నిలవడానికి సహకరించే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం హర్షదాయకం. క్రీడల్లో ఆసక్తి కలిగిన తెలంగాణ యువత ఈ యూనివర్సిటీ ద్వారా తమ క్రీడా నైపుణ్యాలను పెంచుకొని ఒలంపిక్ పతకాలు సాధించే స్థాయికి చేరుకోవాలనే సదాశయంతో క్రీడా విశ్వవిద్యాలయానికి హకీంపేట సమీపాన ఫ్యూచర్ సిటీ పేరుతో 200 ఎకరాల ప్రాంగణాన్ని తీసుకురావడం హర్షదాయకం. యువతలో క్రీడా నైపుణ్యాలను పెంచడం, క్రీడా పరిశోధనలకు తలుపులు తెరవడం, క్రీడల ద్వారా ఆర్థికాభివృద్ధిని సుసాధ్యం చేయడం జరుగుతుందని ఆశిస్తున్నారు. సాలీనా 365 సీట్లతో వివిధ క్రీడల్లో శిక్షణలు ఇవ్వడానికి పథక రచన జరుగుతున్నది. ఈ యూనివర్సిటీ పూర్తి స్థాయిలో పని చేసినపుడు భారత క్రీడా రంగానికే తెలంగాణ బ్రాండ్ అంబాసియర్ కానున్నదని విశ్వసించడంలో సందేహం లేదు.

**సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ**
**యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ స్థాపన**

వీటికి తోడుగా ములుగులో సమ్మక్కా-సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ యువతకు ఉన్నత విద్యలో, ముఖ్యంగా గిరిజన యువతకు పెద్ద పీట వేయడం జరుగుతుంది. అదే విధంగా ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన హైదరాబాద్ కోటి వుమెన్స్ కళాశాలను చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్చడం కూడా మహిళా విద్యకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం.

ఇటీవల యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కూడా ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బంది పిల్లలకు 50 శాతం, ఇతర విద్యార్థినీవిద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించి నాణ్యమైన విద్యను అందించే కృషి చేయడం జరుగుతుంది. ఈ విధంగా తెలంగాణ ప్రభుత్వం యువ శక్తిని దేశాభివృద్ధికి వినియోగించుకోవడానికి పూనుకోవడం సముచితంగా ఉన్నది.

యువశక్తికి వరంగా మారడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రానున్న రోజుల్లో మన రాష్ట్రాన్ని భారతంలోనే ప్రత్యేక స్థానంలో నిలుపుటకు ఉపయోగపడతాయని నమ్ముదాం, యువ తెలంగాణను నైపుణ్య విద్యా కేంద్రంగా మారుదాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# దళితులకు బిజెపి దగ్గరయ్యేనా?

ఇంకొన్ని గంటల్లో దేశంలోని షెడ్యూల్ కులాలు డా బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతోత్సవం జరుపుకోవడానికి ఉత్సాహంగా ఉన్న సమయంలో అగ్ర నాయకత్వం తమ పార్టీ కార్యకర్తలకు అంబేద్కర్ జయంతి వారోత్సవాలు జరపాలని పిలుపుని చ్చారు. దక్షిణ భారతదేశంలో అత్యధిక ఓటర్లు అయిన ఎస్సీ సామాజిక వర్గాలకు దగ్గర అవడానికి బీజేపీకి ఉన్నట్లు ఉండి అంబేద్కర్ మీద ప్రేమ పుట్టిందా అనే అనుమానం ప్రజల్లో నెలకొంది. ప్రజాస్వామ్యంలో మెజారిటీ కావాలంటే తమలాగే సారూప్యత ఉన్న కులాలతో కలుపుకు పోవాలని మాన్యశ్రీ కాన్షిరామ్ బహుజన్ సమాజ్ పేరిట (ఓ)బిసి లను రిప్రజెంట్ చేస్తూ పార్టీ ని నిర్మించి అణగారిన వారి గొంతుకగా దేశ రాజకీయాల్లో పెను తుఫాన్ సృష్టించాడు. నిజానికి బిసి కులాలను కలుపుకు పోవలనేది అంబేద్కర్ ఆలోచనే.

వెనుకబడిన కులాలను కలుపుకు పోవాలని బాబాసాహెబ్ డా అంబేద్కర్ 1952 అక్టోబర్ లో జరిగే ఎన్నికల కోసం 27 అక్టోబర్ 1951 పంజాబ్ లోని జలందర్ పట్టణంలో దళితులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చెప్పిన మాట. అదే సమయంలో ఆయన ఒక అనుమానం కూడా వ్యక్తం చేశాడు. బిసిలు దళితులతో కలిస్తే వారి సామాజిక స్థాయి దళితుల లాగా అవుతుందని వారి ఆలోచన అని వ్యక్తం చేసాడు.

స్వాతంత్ర్య భారత దేశంలో దళిత ఓటు బ్యాంకు మొదటి నుండి కాంగ్రెస్ సొంతం చేసుకుంది. 1980 నుండి కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును వివిధ ప్రాంతీయ పార్టీలకు జార విడుచుకుంటూ వస్తుంది. అదే సమయంలో బిజెపి కూడా ఉత్తర భారత దేశంలో సంఘ్ పరివార్ శక్తుల ద్వారా బిసి కులాలను ఆకర్షించింది. ఉత్తర ప్రదేశ్ లో కళ్యాణ్ సింగ్, ఉమాభారతి లాంటి వారు ఒక ఉదాహరణ.

1990లో కుల రాజకీయాలను మత రాజకీయాలుగా చెయ్యడంలో బిజెపి హిందుత్వ రాజకీయలు విజయం సాధించాయి. ఇదే సమయంలో బహుజన్ సమాజ్ పార్టీ దక్షిణ భారత దేశంలోని అతి పెద్ద రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో పాగా వేయడానికి ఒక ప్లాట్ ఫామ్ క్రియేట్ చెయ్యబడింది. దురదృష్టవశాత్తు అది కార్యరూపం దాల్చలేదు. దీనితో బహుజన్ సమాజ్ పార్టి బెహన్ జి మాయావతి నేతృత్వంలో ఉత్తరప్రదేశ్ కె పరిమితమైంది. ఒక వైపు జనతాదళ్ విఫలం అవడం, కాంగ్రెస్ బలమైన నాయకులు ప్రాంతీయ పార్టీలు పెట్టుకోవడం మాన్యశ్రీ కాన్షిరామ్ చనిపోవడం తో దళిత ఓటు చెల్లా చెదురై పోయింది. మాన్యశ్రీ కాన్షిరామ్ నే బీజేపీ తో పోత్తు పెట్టుకుని దళితులకు బిజెపి ని పరిచయం చేశాడు. అదే సందర్భంలో తెలంగాణ కు చెందిన బంగారు లక్షణ అనే మాదిగ కుల వ్యక్తిని పార్టీ జాతీయ అధ్యక్షుడుగా చేసింది.

ప్రపంచ మార్కెట్లు భారత దేశం పై కన్నేసి లిబరలైజేషన్, ప్రైవేటై జేషన్, గ్లోబలైజేషన్‌ను భారతీయులకు పరిచ యం చేసింది. దీనితో రాజకీయాలు ముక్కచెక్కలై పోవడం ప్రపంచ వ్యాప్తంగా జరిగినట్లే ఇండియాలో కూడా జరిగింది. ఆధునికానంతరవాదం ప్రపంచ దేశంలో మార్క్సిస్టులకు కమ్యూనిస్టులకు వ్యతిరేకం గా మారుతూ వచ్చింది అలాగే భారత దేశంలో దళితులను కమ్యూనిస్టుల నుండి, మార్క్సిస్టుల నుండి దూరం చేసింది. ఇందుకు బాబాసాహెబ్ రచనలు ప్రసంగాలు మరింత దోహత పడ్డాయి.

ప్రజల్లో చీలిక తేవడంలో పెట్టుబడిదారులు విజయం సాధించారు. అధినికానంతర వాద



సంస్కృతి, అస్తిత్వ ఉద్యమాలు భారత దేశంలో కూడా ప్రారంభించారు. దీనితో ఏ కులం,ఆ కులం, ఏ మతం ఆ మత రాజకీయాలు మొదలినాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ లో ఎస్సి వర్గీకరణ ద్వారా మాదిగలు తమ అస్తిత్వ ఉద్యమం, తమకు అనుకూలమైన పార్టీ కి మద్దత్తు పలికే స్థాయికి పోయింది, అది బిజెపినా లేక తెలుగుదేశం కాలేక కాంగ్రెస్‌కా అనేది అప్రస్తుతం. అలాగే ఉత్తరప్రదేశ్‌లో పాసీ అనే కులం. బిజెపికి దగ్గరైంది. బీహార్ లో పాశ్వాన్లు, మహారాష్ట్ర లో రిపబ్లికన్ పార్టీలు కేంద్రంలో బిజెపి కి మద్దత్తు పలుకుతున్నాయి. డా.అంబేద్కర్ రచనలు చదివి దళిత మేధావులు కమ్యూనిస్టు, మావోయిస్టులు ల నుండి దూరంగా వచ్చేసారు గానీ మతత్వ శక్తులను దూరం పెట్టలేకపోయింది. ఈ పరిణామాల గమనించిన బిజెపి దళితుల కోసం బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పూజించడం మొదలు పెట్టింది. దళితుల ఇంటికి వెళ్లి సహపంక్తి భోజనాలు చెయ్యడం ప్రారంభించారు.

దళితులంటే జాతవ్ మరియు చమర్స్ మాత్రమే కాదని దళితుల్లోని అభివృద్ధి చెందని కులాల యువతకు ప్రాధన్యత ఇచ్చారు. మరోవైపు బిఎస్పిని నిర్వీర్యం చేస్తూ పార్టీ అధినాయకత్వంను అవినీతి కేసులో అరెస్ట్ చేస్తామనే సిగ్నల్ పంపి 2014 నుండి ఆ పార్టీ కార్యకలాపాలు లేకుండా చేశారు. మరో వైపు దేశ వ్యాప్తంగా దళితుల్లోని ఆల్ ఇండియా సర్వీస్ మాజీ ఉద్యోగులను ఎరవేసి తన వైపు తిప్పు కున్నారు. దళితుల్లోని నిరుద్యోగ యువతను, కుల సంఘాలను ఈ ఆల్ ఇండియా మాజీ సివిల్ సర్వీసు ఉద్యోగులు చేరదీసి బిజెపిలో దళితుల రిప్రజెంటేషన్ ఉండాలని కాంగ్రెస్, మరియు ఇతరులు దళితులకు ఏమి చేసిందని మాట్లాడించ డం చేశారు. అస్తిత్వ (కుల, మత, ప్రాంతాల) ఉద్యమం పేరిట బిజెపికి మద్దతు పలుకుతూ తమ గోతిని తామే తొవ్వుకుంటున్నారు. 'దృఢ నిశ్చయులమై మనం నిర్మాణయుతంగా లేకపోతే పదేళ్ల తర్వాత మనుస్మృతి రాజ్యం ఏర్పడే ప్రమాదం ఉందని డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 27 అక్టోబర్ 1951, జలందర్, పంజాబ్‌లో ఎన్నికల సభలో మాట్లాడుతూ చేసిన హెచ్చరిక.

75 ఐదు సంవత్సరాల క్రితమే అంబేద్కర్ జరగబోయే పరిణామాలు చెప్పారు. దళితులు నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వేదకాలం నాటి బాధల్లో పడేప్రమాదం ఉంది.

**- బల్లికిరవ. వెంకట్**
9652680802

## శవదీవెన

మీరిద్దరూ ప్రేమించుకున్నారు
సరే!
పెద్దల అనుమతీ
పొందాలనుకున్నారు
ఇంతలో...
జరగరానిది జరిగిపోయింది

ఓ సాహసీ!
తండ్రిశవం ఎదురుగానే
తాళి కట్టేసావు,
తండ్రి దీవెన పొందాలనుకుని
సాంప్రదాయరాహిత్యానికి
పూనుకొన్నావు

ఇటు నాన్న... అటు ప్రేమ
ఈ శుభాశుభాల సంధిలో
గెలిచింది నీ నిర్ణయం
నివ్వెరపోయింది ప్రేమలోకం
ఈ ఉదంతం ప్రేమపుటల్లో
సువర్ణాక్షరాలే

నీ పితృభక్తి అనితరసాధ్యం
మరి గెలవాలి
నీ సతికుటుంబమనసును
కూడా!

**(తమిళనాడులో తండ్రి దీవెనలు కోరి తండ్రి మృతదేహం ఎదుట ప్రియురాలిని పెళ్లాడిన కుమారుడు... ఘటనకు స్పందనగా)**

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

## తీరం దాటుతున్న అలలు

అధికారం
సముద్ర తీరం వెంట
నిర్మించుకున్న ఇసుక గూడు!
ఎన్నికలకు
కాలనీయమం ఉండవచ్చు
అలలకు పెను తుఫానులకు లేదు!
అబద్ధాలు
ఆవలి తీరం దాటించవచ్చు
అలలు తీరం దాటితే అల్లకల్లోలమే!
గాయాలకు
మందేదో తెలియనప్పుడు
వైద్యం వికటిస్తుంది!
గాలిలో దీపాన్ని
ఎంతకాలం కాపాడుకుంటావు
రెపరెపలాడుతూనే కొండెక్కుతుంది!
కర్ణాకర్ణిక వింటున్న
అసంతృప్తి లోలోన
అగ్నిపర్వతమై మండుతున్నది!
లావా ఎగజిమ్ముతున్నప్పుడు
ఎదురు నిలవాలని కోవడం
ఒక వెర్రి బాగులతనం!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# బీసీ ఎస్సీ హాస్టల్లో

## విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే పెంచాలి. రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్



కర్నూలు ఏప్రిల్ 21మనం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ. ఎస్సీ. హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కర్నూలు జిల్లా కలెక్టర్ కి పబ్లిక్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేష్₹ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్య మంత్రివర్యులు ,ఉపముఖ్యమంత్రి వర్యులు, విద్యాశాఖ మంత్రి వర్యులు, బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎక్కడికెళ్లిన వారు తాగే టి 150 రూపాయలు ఉంటుంది మరియు రాష్ట్రంలో ఏ హోటల్ లో అయినా రెస్టారెంట్లో అయినా ఒక లీటరు వాటర్ బాటిల్ 20 రూపాయలు ఉంటుంది కానీ బీసీ ఎస్సీ. హాస్టల్ విద్యార్థులకు రోజుకు మెస్ చార్జీలు మూడు ,నాలుగు తరగతి విద్యార్థులకు 38 రూపాయలు 5 నుండి 9వ తరగతి విద్యార్థులకు 48 రూపాయిలు ఇంటర్ పై తరగతి విద్యార్థులకు 56 రూపాయలు రోజుకు ఇవ్వడం చూస్తా ఉంటే విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా కపట ప్రేమ చూపుతోందో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు కావున తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు మానవతా కోణంలో హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు మీ గుండెతోనా, కడుపుతోనా, చెవులతోనా విని తక్షణమే హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలు మరియు కాస్మోటిక్ చార్జీలు నెలకు 500 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో బీసీ ఎస్సీ. హాస్టల్స్ కు శాశ్వత భవనాలు కేటాయించి విద్యార్థుల జీవితాలను కాపాడాలని కోరారు. అదేవిధంగా లేడీస్ హాస్టల్స్ కు వాచ్మెన్, హెల్పర్స్, హాస్టల్ వార్డెన్ ను ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి లేడీస్ హాస్టల్స్ విద్యార్థినులు ల మాన ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో అనేక పోటీ పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తా ఉంది బీసీ విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టుకోలేక కొన్ని పరీక్షలు మాత్రమే రాయడానికి ముందుకెళ్తున్నారు కొన్ని పోటీ పరీక్షలకు దూరమవుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఇచ్చిన ఫీజు సడలింపు నిబంధనలకు అనుగుణంగా బీసీ విద్యార్థులకు కూడా ఫీజు సడలింపు ఇచ్చి అన్ని పోటీ పరీక్షలు రాసుకునే విధంగా బీసీ విద్యార్థులకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మధు.ప్రవీణ్ పాల్గొనడం జరిగింది.

## మద్యానికి బానిసైన కొడుకును అదుపులో పెట్టేందుకు
# పోతే చివరకు ప్రాణమే పోయింది



జూపాడుబంగ్లా ఏప్రిల్ 21 (మనం న్యూస్): జూపాడు బంగ్లా మండలంలోని తరిగోపుల గ్రామంలో ఒక వింత ఘటన చోటు చేసుకుంది, జూపాడు బంగ్లా మండలం తరిగోపుల వీఆర్వో చంద్రశేఖర్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తరిగోపుల గ్రామానికి చెందిన గొల్ల సుధాకర్, తండ్రి రాముడు, వయస్సు 34 సంవత్సరాలు లారీ డ్రైవర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు, గొల్ల సుధాకర్ మద్యానికి బానిసై ఎక్కడ పనికి వెళ్లకుండా డబ్బు కోసం ప్రతిరోజు అతని అమ్మని అతని భార్యని కొడుతూ హింసిస్తూ ఉండేవాడు, అంతట అతని అమ్మ గోవిందమ్మ, 20వ తేదీ ఏప్రిల్ 2025 నా మధ్యాహ్నం ఊరికి వెళ్లి అదే రోజు సుమారు 9 గంటలకు ఊరి నుండి తిరిగి రాగా గొల్ల సుధాకర్ మద్యం సేవించి తన అమ్మ గోవిందమ్మతో మరియు భార్య సుమిత్రతో గొడవ పడడంతో అతని అమ్మ గోవిందమ్మ మరియు భార్య సుమిత్ర మనోవేదనకు గురై ఆ బాధలు పడలేక అతని కాళ్లు చేతులు విరగగొట్టయినా సరే ఒక ముద్ద పాడేయొచ్చు ఆయనను చూసుకోవచ్చు అని ఉద్దేశంతో అతడిని అదుపులో పెట్టుకోవడానికి కట్టెలతో గొల్ల సుధాకర్ ని తల్లి గోవిందమ్మ, భార్య సుమిత్ర, కొట్టగా దెబ్బలు తానలేక రాత్రి సుమారు 10 గంటల సమయాన చనిపోయినాడు, వీఆర్వో చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్త్రు లక్ష్మీనారాయణ తెలియజేశారు.

## జాతరను ప్రశాంతంగా
# జరుపుకోవాలి



- జొన్నగిరి ఎస్సై మల్లికార్జున...

తుగ్గలి, ఏప్రిల్ 21 ( మనం న్యూస్)ః జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మేరకు తుగ్గలి మండలం పరిధిలోని జొన్నగిరిలో పోలీస్ స్టేషన్ ఎన్ సి ఎస్త్రు మల్లికార్జున పోలీస్ సిబ్బందితో కలిసి జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి తాండ గ్రామాన్ని సోమవారం సాయంత్రం సందర్శించి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు.గ్రామంలో జరగబోయే గ్రామ జాతరను గ్రామ ప్రజలు కలిసి కట్టుగా ఎటువంటి గొడవలు జరగకుండా భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు ప్రశాంతంగా నిర్వహించాలని,గ్రామంలో జాతర సందర్భంగా ఎటువంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని తెలుపుతూ గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని,రోడ్డు ప్రమాదాల పైన,మహిళ పై జరిగే నేరాలపైన,సైబర్ నేరాలపైన ప్రజలకు అవగాహనా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జొన్నగిరి పోలీస్ సిబ్బంది జగన్,మదన్,జనార్దన్ లు మరియు లక్ష్మి తాండ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జీవించండి...
# గొడవలకు దూరంగా ఉండండి

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించండి
- గ్రామాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు ముఖ్యం... పిల్లలను బాగా చదివించాలి
- ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం



వెల్దుర్తి ఏప్రిల్ 21మనం న్యూస్ః వెల్దుర్తి మండలం, బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామమైన బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో జిల్లా ఎస్పీ పర్యటించారు. గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలోని తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అల్లర్లు, గొడవలు జోలికెళ్లకుండా ఉండేలా గ్రామస్తులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఎవరో అన్యాయం చేశారని, మనం తప్పు చేయకూడదని ఆలోచించాలన్నారు. అందరూ బాగుండాలన్నారు. తప్పు చేసిన వారికి చట్టప్రకారం శిక్షలు ఉంటాయన్నారు.గ్రామ ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ఎలాంటి గొడవలు, సమస్యల జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమైనా గ్రామంలో సమస్యలు ఉంటే జిల్లా ఎస్పీ కి గాని లేదా సంబంధిత పోలీసులకు గాని తెలియజేయాలన్నారు. సమస్యలుంటే తెలియజేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కక్షలు, కార్పణ్యాల జోలికి వెళ్ళ కూడదన్నారు. వీటి వల్ల జీవితాలు నాశనం కావడంతో పాటు కేసుల్లో ఇరుక్కుపోయి భవిష్యత్తును అంధకారం చేసుకుంటారని హితబోధ చేశారు. గ్రామంలో నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు ముఖ్యమన్నారు. గ్రామంలో చిన్న పిల్లలతో మాట్లాడారు. బాగా చదువుకోవాలని సూచించారు. ఏవైనా ఘటనలు తలెత్తితే నిర్భయంగా ఫిర్యాదు చేయండి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ తేజమూర్తి , వెల్దుర్తి సిఐ మధుసూధన్ రావు, కర్నూలు ఒన్ టౌన్ సిఐ రామయ్య నాయుడు, మహిళా పియస్ సిఐ విజయలక్ష్మీ , స్పెషల్ బ్రాంచ్ ఎస్త్రు ఖాజావలి, వెల్దుర్తి ఎస్సై అశోక్ , క్రిష్ణగిరి ఎస్సై మల్లికార్జున ఉన్నారు.

# చిత్రలేఖన పోటీలు




- లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు

కర్నూలు ఏప్రిల్ 21మనం న్యూస్: నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఏపీ క్యాంప్ కట్టమంచి రామ లింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్లో పృధ్వి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడు, ఎనిమిది ,తొమ్మిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో రీసైక్లింగ్ పాత్ర అనే అంశంపై చిత్రలేఖన పోటీలను లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ భాష మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన గాలి ,నీరు ,వాతావరణం అందించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎం.ఆర్.ఓ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మురారి శంకరశంకరప్ప ,ఉపాధ్యక్షుడు తిరుపతి సాయి ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .అనంతరం కె.ఎన్.ఆర్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో రీసైక్లింగ్ పాత్రఅంశంపై 7 ,8 ,9 విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు .లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత న జరిగిన ఈ వ్యాసరచన పోటీల కార్యక్రమ ప్రారంభంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ కార్యదర్శి గోపీనాథ్ ,డిఎస్పీ మహబూబాషా ,తిరుపతి సాయి తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన రైతు మహోత్సవం



నిజామాబాద్, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి)ః రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి 23 వరకు కొనసాగనున్న రైతు మహోత్సవం కార్యక్రమం సోమవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు మహోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి మంత్రితో కలిసి హెలికాప్టర్ లో విచ్చేసిన సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తదితరులు ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ అధికారులు భవాని శ్రీ, గోపి, వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు భాగస్వాములు అయ్యారు. రైతు మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కలెక్టర్ రాజీవ్ గాంధీ , ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, నుడా ఛైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులుగా ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర, పరికరాలు పంపిణీ చేశారు.

## రాజీవ్ యువ వికాసం పథకానిని అన్యహ్య స్పందన - కలెక్టర్ క్రాంతి



సంగారెడ్డి, ఏప్రిల్ 21(మనంప్రతినిధి)ః కలెక్టరేట్లో రాజీవ్ వికాసం పథకం పై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ సివిల్ స్కోర్ తో సంబంధం లేకుండా అర్హులైన వారికి ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ఈ పథకం లో అర్హులైన నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్నిఅందించాలన్నారు. నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన లభించిందనీ ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయన్నారు. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించగా రూ.50వేలు మొదలుకుని రూ.4లక్షల వరకు రుణం పొందేందుకు పథకాలను ప్రభుత్వం నిర్వహించిందని ఈనెల 14వ తేదీతో దరఖాస్తు సమర్పణకు ప్రభుత్వం ఆన్లైన్లో చివరి తేదీగా నిర్ణయించిందన్నారు. జిల్లా మొత్తంలో 51,657మంది దరఖాస్తులు సమర్పించారని అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకుగాను 23,681, ఎస్సీ విభాగం లో 7,415 యూనిట్లకు 14,480, మైనార్టీ విభాగం లో 2,456 యూనిట్లకు 8,378, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించాలని తెలియజేశారు. పథకం కింద అర్హత పొందిన వారికి రెండు దఫాలుగా వారి ఖాతాల్లో నగదు జమకానుంది. తొలుత సగభాగం యూనిట్లు కొనుగోలు చేసే సమ యంలో, మిగిలిన సగభాగం యూనిట్లు కొను గోలు చేసిన తర్వాత అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, పిడి డిఆర్డిఏ జ్యోతి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రామాచారి, సాంఘిక సంక్షేమ శాఖ/ గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్,ఎల్ డి ఎం గోపాల్ రెడ్డి, జిల్లా అల్ప సంఖ్య సంక్షేమ అధికారి దేవుజా , వివిధ బ్యాంక్ అదికారులు పాల్గొన్నారు.

# పూలే సినిమాను వెంటనే విడుదల చేయాలి



- బత్తుల లక్ష్మీకాంతయ్య

కర్నూలు ఏప్రిల్ 21(మనం న్యూస్)ః పూలే సినిమాను వెంటనే విడుదల చేయాలని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు... ఈరోజు కర్నూల్ లోని బిర్లా కాంపౌండ్ లోని పూలే భవన్లో బీసీ ముఖ్య నేతల అత్యవసర సమావేశం జరిగింది... ఈ సందర్భంగా భత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత చరిత్రపై పూలే సినిమా నిర్మిస్తే.. కొంతమంది దుష్టశక్తులు సెన్సార్ బోర్డు కు వెళ్లి అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు.. కొన్ని వందల ఏళ్ల కిందటనే అంటరానితనం నిర్మూలనకు... సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా..... పోరాటం జరిపి ప్రజల్లో సాంఘిక చైతన్యాన్ని తీసుకొని వచ్చిన మహానీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు... పూలే చరిత్రను ఉన్నది ఉన్నట్లుగా సినిమాలో చూపిస్తుంటే.. తమ ఉనికికి ప్రమాదం వస్తుందని కొన్ని శక్తులు అడ్డుకున్నాయన్నారు... ఆనాడే పూలే చదువు యొక్క ఆవశ్యకతను గుర్తించి... బాలికల కొరకు పాఠశాల ఏర్పాటు చేసి .... తన సతీమణి అయిన సావిత్రిబాయి పూలే ఒక విద్య నేర్పి. బాలికల విద్యను ప్రోత్సహించిన మహానీయుడు అన్నారు.... ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవ పూజ ధనుంజయ ఆచారి... అయ్యన్న యాదవ్.. న్యాయవాది వై మధుసూదన్.. శ్రీనివాసులు... మహిళా సంఘ నేత జి చంద్రికమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పన కోసం మూడంచెల వ్యూహం అమలు

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు
- 100కు పైగా కంపెనీలలో 5 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహణ




మధిర, ఏప్రిల్ 21(మనం న్యూస్)ః కోరి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పన కోసం ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొని, 5 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించేందుకు మనపై నమ్మకం ఉండడం చాలా ముఖ్యమని, చిన్న ఉద్యోగమైనా మనం చేరితే మనలో విశ్వాసం పెరుగుతుందని, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇది తోడ్పాటు అందిస్తుందని అన్నారు. యువతకు వచ్చిన అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, జాబ్ మేళాలో వచ్చిన ఉద్యోగాల్లో ఎటువంటి సమస్య వచ్చినా అవసరమైన సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. మేగా జాబ్ మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సీఎంకు ఇంచార్జి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మెగా ఉద్యోగ మేళాలో సింగరేణి జనరల్ మేనేజర్ సాలెం రాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు, యువత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లతో ల్యాబ్ టెక్నీషియన్ జాబులు పొందిన వారిపై సమగ్ర విచారణ జరిపించాలి



కర్నూలు, ఏప్రిల్ 21మనం న్యూస్ః 2023 సంవత్సరంలో వెలువడిన స్టాఫ్ నర్సు, ఫార్మాసిస్ట్ , ల్యాబ్ టెక్నీషియ పోస్టులకి కొంతమంది అభ్యర్థులు నకిలీ కోవిడ్ సర్టిఫికెట్ , నకిలీ మార్క్ లిస్టులతో జాబులు పొందాలని ఆరోపణలు వస్తున్నాయని దీనిపైన సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ పాల్గొన్నారు. ఈఈ సందర్భంగా శ్రీనివాసులు రాజీవ్ లు మాట్లాడుతూ 23/13/23 సంవత్సరంలో అర్బన్ హెల్త్ సెంటర్లలో స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకి నోటిఫికేషన్ విడుదల చేస్తే అప్లై చేసిన అభ్యర్థులు కొంతమంది నకిలీ కోవిడ్ సర్టిఫికేట్, నకిలీ మార్క్ లిస్టులో , నకిలీ క్యాస్ట్ సర్టిఫికెట్ సమర్పించి ఉద్యోగాలు పొందారని అనుమానాలు కలుగుతున్నాయని అందుకు ఉదాహరణ ఇదే పోస్టులకి 2021 సంవత్సరంలో నోటిఫికేషన్ వస్తే కోవిడ్ సర్టిఫికెట్ లేదని, మారక్స్ తక్కువగా ఉన్నాయని జాబులు పొందలేని వ్యక్తులు 2023 నోటిఫికేషన్ నాటికి మారక్స్ ఏ విధంగా పెరిగాయని మరియు కోవిడ్ ఎక్స్పిరియన్స్ సర్టిఫికెట్ ఏ విధంగా తెచ్చుకున్నారని అనేక అనుమానాల కలుగుతున్నాయి కావున వీటిలో డిఎం హెచ్ ఓ అధికారుల నిర్లక్ష్యం కూడా కనపడుతుందని కావున 2023 నోటిఫికేషన్ లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి నిజమైన లబ్ధిదారులకి ఉద్యోగం వచ్చే విధంగా చర్యలు తీసుకొని నకిలీ కోవిడ్ సర్టిఫికెట్లు , నకిలీ మార్క్ మెమోస్, నకిలీ సర్టిఫికెట్లు ఉద్యోగాలు పొందిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు వీటి పైన సమగ్ర విచారణ జరగకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

# రైతులు అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




**నిజామాబాద్, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో వివిధ అంశాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తొలిరోజైన సోమవారం పసుపు సాగులో మెళకువలు, ఆదర్శ రైతుల అనుభవాలు, చెరకు సాగులో అవరోధాలను ఎలా అధిగమించాలి, ఆయిల్ పామ్ సాగుతో సమకూరే ప్రయోజనాలు, వరి పంటలో మేలు రకాలు, నిర్ణీత సమయంలో పంట విత్తుకోకపోతే కలిగే నష్టాలు, మొక్కజొన్న పంట సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, సుగంధ ద్రవ్యాల సాగు, వాటి ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పించగా, ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరిస్తూ రైతులలో ఆసక్తిని పెంపొందింపజేశారని తెలిపారు.

22న మంగళవారం నిర్వహించే అవగాహన కార్యక్రమాల వివరాలు

రైతు మహోత్సవంలో భాగంగా ఈ నెల 22న ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు.

22వ తేదీ ఉదయం 10 గంటల నుండి 10:30 వరకు నాణ్యమైన పసుపు పంట సాగు పద్ధతులపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మనోహర్ రావు రైతులకు అవగాహన కల్పిస్తారని, 10:30 నుండి 10:45 గంటల వరకు మామిడి, ఇతర పండ్ల తోటల పెంపకం పై సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ పి.హరికాంత్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉదయం 10:45 నుండి 11:15 గంటల వరకు ఆయిల్ పామ్ సాగుపై శాస్త్రవేత్త నర్సింహారావు, 11:15 నుండి 11:30 గంటల వరకు ఆదర్శ రైతు సుభాష్ తన అనుభవాలను వెల్లడిస్తారని, 11:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు సేంద్రీయ పంటల సాగుపై మంచిర్యాల కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.శివకుమార్, 12:00 నుండి 12:15 వరకు ఆదర్శ రైతు సోమరాజారెడ్డి స్వీయ అనుభవాలను వివరిస్తారని,12:15 నుండి 12:45 వరకు సోయాబీన్, పత్తి పంటల సాగులో మెళకువల గురించి ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వై.ప్రవీణ్, 12:45 నుండి 1:00 వరకు ఆదర్శ రైతు ఆలేటి బాలకిషన్ తన అనుభవాలను తెలియజేస్తారని అన్నారు.

భోజనానంతరం మధ్యాహ్నం 2:00 నుండి 2:30 గంటల వరకు పశువుల మేత, నిర్వహణ అంశాలపై డాక్టర్ నితీష్ వర్మ, 2:30 నుండి 2:45 వరకు ఆదర్శ రైతు ఎన్.గంగారాం కూరగాయల సాగుపై తన అనుభవాలను పంచుకుంటారని, 2:45 నుండి 3:15 వరకు డెయిరీ నిర్వహణపై ఆకుల పాపయ్య, 3:15 నుండి 3:30 వరకు ఆయిల్ పామ్, పసుపు సాగుపై డి.గంగారెడ్డి, 3:30 నుండి 4:00 వరకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం గురించి నిజామాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయులు, సాయంత్రం 4:00 నుండి 4:15 వరకు స్పాన్ పెంపకంపై ఆదర్శ రైతు వెలగపూడి గోపాల్, 4:15 నుండి 4:45 వరకు మిర్చి పంట సాగుపై శాస్త్రవేత్త కె.నాగరాజు, 4:45 నుండి 5:00 గంటల వరకు కూరగాయల సాగుపై ఆదర్శ రైతు నాగ పోతరావు అవగాహనా కల్పిస్తారని కలెక్టర్ వివరించారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 76 వ సారి రక్తదానం చేసిన డాక్టర్ బాలు

- వృద్ధురాలికి సకాలంలో రక్తం అందజేత
- రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు

**కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామానికి చెందిన బాలవ్వ (68) కు అత్యవసరంగా ప్రభుత్వ వైద్యశాల కామారెడ్డి లో ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారికి కావాల్సిన రక్తాన్ని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు జిజిహెచ్ రక్తనిధి కేంద్రంలో 76 వ సారి రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు



మాట్లాడుతూ., రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేసినప్పుడే వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానం చేసే వారిలో గుండెపోటు, కొలెస్ట్రాల్, క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం చాలా వరకు తక్కువ అని అన్నారు. తలసేమియా చిన్నారుల కోసం,ప్రభుత్వ వైద్యశాలలోని రక్తనిధి కేంద్రాలకు కావలసిన రక్తాన్ని అందజేయడం కోసం రక్తదాన శిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్, బుక్క రజినిబాలు టెక్నీషియన్ ప్రమోద్ లు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ షబ్బీర్ అలీ

**నిజామాబాద్, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** నిజామాబాద్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ( సిఎంఆర్ఎఫ్) 21 చెక్కులను దాదాపు 20లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోనీ పలు



కాలనీల లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగింది అన్నారు..అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు. పేదలకు సహాయంగా అండగా. నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందిస్తాం,ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నాం రుణమాఫీ చేసి చూపించాం రైతు భరోసా అందిస్తున్నాం, మహిళలకు ఉచిత బస్సు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అన్నారు.రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# ఘనంగా ఏఐబి ఈ ఏ ఫౌండేషన్ డే

- అసోసియేషన్ సీనియర్ నాయకులు బోస్ బాబు

**నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 21( మనం న్యూస్):** ప్రతి ఒక్కరు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఏఐబి ఈ ఏ క్రీడ పోటీల్లో బ్యాంక్ ఉద్యోగులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి బ్యాంకు ఉద్యోగి విధుల్లో నిమగ్నమైపోయి దేశ అభివృద్ధి కోసమే పాటుపడే బ్యాంక్ ఉద్యోగస్తులు ఈ రకంగా క్రీడ పోటీలలో పాల్గొనడం శారీరకంగా ఉత్సాహాన్ని కలిగిస్తుందని బ్యాంక్ అసోసియేషన్ జాతీయ నాయకుడు బోస్ బాబు అన్నారు. సోమవారం నగర శివారులోని గ్లోబల్ స్కూల్ లో బ్యాంక్ ఉద్యోగస్తుల సంఘాల పథకాన్ని ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని బ్యాంక్ ఉద్యోగస్తులు తమ సమస్యలను పరిష్కారం పోరాటం చేస్తూనే దేశం ఆర్థికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ సంఘం స్థాపించి 80 వ వసంతంలో అడు గేస్తున్న సందర్భంగా క్రీడల ఉత్సవాలను జరుపుకోవడానికి అన్ని బ్యాంక్ ఉద్యోగస్తులు ఏకతాటిపై కొచ్చి పాల్గొనడం చాలా గొప్ప



విషయమని ఆయన అన్నారు. రాబోయే రోజులలో ఒకవైపు ట్యాంకుల అభివృద్ధికి తో పాటు బ్యాంకులలో ఉన్న ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించుకునేందుకు జాతీయ స్థాయిలో సమస్యలను తీసుకెళ్లి తమకు రావాల్సిన హక్కులను సాధించుకొని తీరుతామని ఆయన అన్నారు. ఈ 80 వ క్రీడా ఉత్సవాలలో షటిల్, వాలీబాల్, క్యారం, చెస్, బ్యాట్మెంటల్, టేబుల్ టెన్నిస్, 100 మీటర్ల రన్నింగ్, రింగ్ స్పూన్ తో పాటు వివిధ రకాల క్రీడలను నిర్వహించుకోవడం జరిగిందని, ఈ క్రీడ పోటీలను న్యాయ నిర్మాతగా అజ్మత్ ఖాన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ రీజనల్ వెంకటేష్, ఆదిత్య, కుమార్, ఉదయ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళా నాయకురాలు శృతి, స్వరూప. సైలజా, దీపిక, శృతి అఖిల, సంధ్య, నాయకులు పాల్గొన్నారు.

## 30 ఎంబసీలు, కాన్సులేట్ల మూసివేత!

- ట్రంప్ ప్రభుత్వం యోచన

**వాషింగ్టన్,ఏప్రిల్ 21:** విదేశాల్లోని దాదాపు 30 రాయబార కార్యాలయాలను, కాన్సులేట్లను మూసివేయాలని ట్రంప్ ప్రభుత్వం చూస్తోంది. విదేశాల్లో తమ దౌత్య విధానాల మార్పుల్లో భాగంగా ఈ చర్య చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తనకు లభించిన విదేశాంగశాఖ పత్రాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్టు దీనిపై ఒక కథనాన్ని ప్రచురించింది. ముందుగా సోమాలియా, ఇరాక్‌లోని కార్యాలయాలను మూసివేయాలనే సిఫారసులు ఆ పత్రాల్లో ఉన్నాయి. ఈ పత్రాలపై విదేశాంగ మంత్రి రుబియో సంతకాలు చేశారా.. లేదా అన్నది తెలియరాలేదు. ఈ పత్రాల్లోని వివరాల ప్రకారం.. 18 ఎంబసీలను, 17 కాన్సులేట్లను ట్రంప్ ప్రభుత్వం మూసివేయాలని భావిస్తోంది. వీటిలో ఎక్కువ భాగం ఐరోపా, ఆఫ్రికాల్లోనే ఉన్నాయి. ఆసియా, కరీబియన్లలో ఒక్కోటి ఉన్నాయి. మూసివేయాలని భావిస్తున్న ఎంబసీల్లో మాల్టా, లక్జెంబర్గ్, లెసోతో, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దక్షిణ సూడాన్ ఉన్నాయి. మూసివేయాలనుకుంటున్న కాన్సులేట్లలో 5 ఫ్రాన్స్‌లో, 2 జర్మనీలో, 2 బోస్నియా అండ్ హెర్జ్‌గోవినా, 1 బ్రిటన్‌లో, 1దక్షిణాఫ్రికాలో, 1 దక్షిణ కొరియాలో ఉన్నాయి.

మూసివేసిన ఎంబసీల కార్యకలాపాలను పొరుగు దేశాల నుంచి నిర్వహించాలని విదేశాంగశాఖ పత్రాలు సూచించాయి. ఎంబసీలు, కాన్సులేట్ల మూసివేతపై స్పందించేందుకు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ నిరాకరించారు. ఏవైనా అనుమానాలుంటే శ్వేతసౌధాన్ని సంప్రదించాలని సూచించారు. లీకైన పత్రాల్లోని వాటిపై ఎలా స్పందించగలమని, అవన్నీ తప్పని స్పష్టం చేశారు.

# ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించాలి

- కామారెడ్డి అదనపు కలెక్టర్ వి. విక్టర్


**కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనంప్రతినిధి):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించే వెంటనే డిస్పోస్ చేయాలని అన్నారు. ఈ రోజు ప్రజావాణి లో (108)అర్జీలు రావడం జరిగాయని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పై విచారణ త్వరగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం జారీచేసిన కొత్త వెర్షన్ లో చేపట్టాలని తెలిపారు. సబ్ కలెక్టర్, ఆర్డీఓ లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనిగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగాయని, అయ్యా కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదని అధికారుల దృష్టికి వచ్చిందని తెలిపారు. కొన్ని మండలాల్లో రెండుపడక గదుల ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అన్నారు. తహసీల్దార్లు ఆన్లైన్ లో ధరణీ ఫైల్స్ ఫార్వర్డ్ చేస్తున్నారనీ, మాన్యువల్ ఫైల్స్ పంపించడం లేదని అన్నారు. ఈ ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీఓ వీణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హార్ట్ సర్జరీ కోసం 2,25,000 ఎల్ ఓ సి అందజేత

- మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**భీంగల్, ఏప్రిల్ 21(మనంన్యూస్):** భీంగల్ మండల కేంద్రానికి చెందిన నస్రీన్ బేగం అహ్మద్ హార్ట్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హార్ట్ బైపాస్ సర్జరీ అవసరమై నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక



నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారికి చికిత్స కొరకు 2,25,000 రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించారు.ఈ రోజు హైదరాబాద్ లోని నివాసంలో బాధితునికి ఎల్ ఓ సి కాపీ అందజేశారు ఈ సందర్భంగా ఎల్ ఓ సి మంజూరు చేయించిన మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## బీజింగ్ ప్రతీకారం: అమెరికా చట్టసభ్యులపై చైనా ఆంక్షలు..!

**బీజింగ్, ఏప్రిల్ 21:** అమెరికాపై చైనా మరోసారి ప్రతీకార చర్యకు దిగింది. అగ్రరాజ్యానికి చెందిన కాంగ్రెస్ సభ్యులు, అధికారులు, ఎన్జీవో అధిపతులపై ఆంక్షలు విధించింది. చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరడంతో.. పరస్పర ప్రతీకార చర్యలు



వేగవంతమయ్యాయి. తాజాగా అమెరికా కాంగ్రెస్ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఎన్జీవో సంస్థల అధిపతులను లక్ష్యంగా చేసుకొని బీజింగ్ ఆంక్షలు విధించింది. హాంకాంగ్‌కు సంబంధించిన అంశాల్లో అతి ప్రవర్తన కారణంగానే ఈ చర్యలు తీసుకొన్నట్లు చైనా విదేశాంగశాఖ వెల్లడించింది. గత నెలలో ఆరుగురు చైనా, హాంకాంగ్ అధికారులపై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై తీవ్రంగా స్పందించిన చైనా.. ట్రంప్ ప్రభుత్వ తీరును ఖండించింది. అప్పుడే బీజింగ్ ప్రతీకారానికి సిద్ధమైనట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ''హాంకాంగ్‌కు సంబంధించిన సమస్యపై అమెరికాకు చెందిన కాంగ్రెస్ సభ్యులు, అధికారులు, ఎన్జీవో అధిపతులు అతిగా స్పందిస్తున్నారు. తప్పుడు చర్యలపై చైనా ప్రతిఘటిస్తుంది'' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ పేర్కొన్నారు. కాగా.. అమెరికాలో ట్రంప్ అధికారం వచ్చాక ఆయన ప్రభుత్వం ప్రపంచ దేశాలపై టారిఫ్లతో వాణిజ్య యుద్ధం చేస్తోంది.

# వారు హంతకులకంటే ప్రమాదకరం.. పిల్లల అక్రమ రవాణాపై సుప్రీంకోర్టు

**ఢిల్లీ,ఏప్రిల్ 21:** దేశ రాజధాని ప్రాంతంలో ఇటీవల అదృశ్యమైన ఆరుగురు పిల్లలను రక్షించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని.. అలాంటి ముఠాలు ఈ సమాజానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించింది. నవజాత శిశువులను రూ.లక్షలకు అమ్ముతున్నట్లు వచ్చిన వార్తలపై జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మాధవన్లతో కూడిన ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. ''ఆ ఆరుగురు చిన్నారుల ఆచూకీని తప్పకుండా గుర్తించండి. పిల్లలను అమ్ముతున్న, కొంటున్న వారిని చట్టం ముందు నిలబెట్టండి. వారందరూ నిందితులే. వారంతా సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమించారు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల



అక్రమ రవాణాదారులు.. హంతకులకంటే ప్రమాదకరమని జస్టిస్ పార్థీవాలా అన్నారు. ''ఎవరైనా ఒక వ్యక్తిని హత్య చేస్తే.. దాని వెనక పలు కారణాలు, ఉద్దేశాలు ఉంటాయి. ఆ తర్వాత అతడు మరో హత్య చేయకపోవచ్చు. కానీ.. పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేవారు.. ఆ నేరాలకు మళ్లీ మళ్లీ పాల్పడుతున్నారు. వారు ఈ సమాజానికి మరింత ప్రమాదకరమైనవారు'' అని ఆందోళన వ్యక్తంచేసింది. ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా రాకెట్ వెనకున్న కీలక సూత్రధారిని వెంటనే పట్టుకోవాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారని.. దీని వెనక ఒక పెద్ద ముఠా పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని కోర్టు పేర్కొంది. అయితే.. వీరిలో కొందరు చిన్నారులు అపహరణకు గురికాలేదని.. తల్లిదండ్రులే అమ్మేస్తున్నారని కోర్టుకు పోలీసులు నివేదించారు. పిల్లలు దొరికిన అనంతరం వారిని తిరిగి తీసుకోవడానికి తల్లిదండ్రులు సిద్ధంగా లేకపోతే.. అప్పుడు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోర్టు పేర్కొంది. ప్రతి ఏడాది దాదాపు రెండు వేల పిల్లల అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయని జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదికలు వెల్లడిస్తున్నాయి.

## కెనడాలో హిందూ ఆలయంపై దాడి

**ఒట్టావా,ఏప్రిల్ 21:** కెనడాలోని సిక్కు వేర్పాటువాదులు మరోసారి రెచ్చిపోయారు. ఖలిస్థానీ జెండాలతో ఏప్రిల్ 19న సర్రేలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయం వద్ద వీరంగం సృష్టించారు. వారి దాడిలో దేవాలయ ప్రవేశద్వారం, స్తంభాలు ధ్వంసం అయ్యాయి. శనివారం ఉదయం 3గంటల ప్రాంతంలో ఇద్దరు దుండగులు ఖలిస్థానీ నినాదాలు చేస్తూ..ఆలయంలోకి ప్రవేశించి స్తంభాలు,



ద్వారాలపై ఖలిస్థానీ అనుకూల రాతలు రాశారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆధారాలు దొరకకుండా సీసీటీవీ కెమెరాలను దొంగలించారని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే ఇటువంటి ద్వేషపూరిత విధ్వంసాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు వెల్లడించారు. ఘటన వెనుక భారత వ్యతిరేక శక్తుల హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. మళ్లీ ఇటువంటి దాడులు జరగకుండా ఆలయం వద్ద భద్రతా దళాలు మోహరించాయని అన్నారు.

# ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా... ప్రయోగాలు చేయనున్న వ్యోమగామి!

ముంబయి, ఏప్రిల్ 21 :ఐఎస్ఎస్‌కు వెళ్లనున్న శుభాంశు శుక్లా తన మిషన్‌లో భాగంగా ఏడు ప్రయోగాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేపట్టబోయే యాత్ర కోసం ప్రధాన వ్యోమగామిగా గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. యాక్సియమ్-4 మిషన్లో భాగంగా మే నెలలో ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. కాగా ఆయన కనీసం ఏడు ప్రయోగాల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. అంతరిక్షంలో పంట సాగు, వాటర్స్ బేర్ (నీటి ఎలుగుబంటి) గురించి అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది.

టార్డిగ్రేడ్, సూక్ష్మ కణజాల జీవిగా పిలిచే నీటి ఎలుగుబంటి భూమండలంపై జీవించి ఉండే అత్యంత అరుదైన జీవి. 0.3 మి.మీల నుంచి 0.5 మి.మీల పొడవు ఉండి పర్యావరణంలో అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని జీవించే డీఎన్ఏను కలిగి ఉంటుంది. ఇలాంటి అరుదైన జీవి డీఎన్ఏను డీకోడ్ చేసిన ఇస్రో.. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో పునరుత్పత్తిని.. భూమి, అంతరిక్షంలో జన్యు మార్పిడిని అధ్యయనం చేయనుంది. అత్యంత శక్తిమంతమైన సూర్యరశ్మితో పాటు గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలో ఈ జీవి డీఎన్ఏలో కలిగే మార్పులకు అనుగుణంగా వ్యోమగాముల రక్షణ వ్యవస్థలను



తయారు చేయనుంది. ఈ అధ్యయనం త్వరలో ప్రయోగించే మానవసహిత గగన్యాన్ మిషన్‌కు ఉపయోగపడనుందని ఇస్రో అంచనా వేస్తోంది. అలాగే ఈ యాత్రలో భాగంగా అంతరిక్షంలో కంప్యూటర్ స్క్రీన్లను ఉపయోగించడం వల్ల కలిగే మార్పులను అర్థంచేసుకోనున్నారు. మైక్రోగ్రావిటీలో గేజ్ ఫిక్సేషన్, వేగంగా కంటిని కదిలించడం వల్ల ఒత్తిడి స్థాయులు ఎలా ఉంటాయో పరిశీలించనున్నారు. దీనివల్ల భవిష్యత్ అంతరిక్ష నౌకల్లో కంప్యూటర్ల రూపకల్పనకు ఉపయోపడనుంది. ఇలా మొత్తం ఏడు పరిశోధనలు చేయనున్నారు.భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందేఅంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామి పంపించనున్నారు. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్‌లో గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఇస్రోఇదివరకే ఎంపిక చేసింది. గగన్‌యాన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో శుభాంశు శుక్లా అతిపిన్న వయస్కుడు కావడం గమనార్హం.

## ఏబిసిడి వర్గీకరణకు ఆర్డినెన్స్ జీవో జారీ చేసిన నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు



- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్

కౌతాళం ఏప్రిల్ 21 (మనం న్యూస్) ః మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆఫీసు నందు విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మన్య మందకృష్ణ మాదిగ ఏ పిలుపు ఇచ్చిన తూచ తప్పకుండా కార్యక్రమం నిర్వర్తించి ఎన్నోసార్లు జైలు,కోర్టులు, చుట్టూ తిరిగిన 30 సంవత్సరాలు ఏబిసిడి వర్గీకరణ కోసం పోరాటం చేసి నిరాశ నిస్పృహ స్థితిలో ఉన్న ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి విశ్వరూప మహా సభతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవం పోసి సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ వివాదమును ముందుండి మాదిగ జాతికే న్యాయం చేసిన నరేంద్ర మోడీ రాష్ట్రము నందు మాదిగల ఆవేదనను అర్థం చేసుకొని ఏబిసిడి వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ జీవోను అమలుపరిచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మండల అధ్యక్షుడు ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్రం వచ్చినప్పటినుండి నేటి వరకు 15% ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను ఒక్క మాల,మాదిగల కైవసం. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ పోరాటముతో 59 ఉపకులాలు పోరాటముతో నేటినుండి వారి వాట ఫలాలు అనుభవించే భాగ్యం మందకృష్ణ వల్లనే సాధ్యమైంది అని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, సంపత్, జలాల్,అన్నమయ్య వీరేష్,తదితరులు పాల్గొన్నారు.

## త్రైమాసిక లక్ష్యాల ప్రణాళికను అమలు చేయాలి

- పంటల సాగు,సాంకేతికత, నీటి సంరక్షణ అంశాల్లో సమగ్రాభివృద్ధి తో ఆదర్శ గ్రామాన్ని తీర్చిదిద్దాలి
- పీపీపీ మోడ్ లో జిల్లా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, ఏప్రిల్ 21(మనం న్యూస్): అన్ని శాఖలు త్రైమాసిక లక్ష్యాలు, సాధన తో ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు.. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ ల కాన్ఫరెన్స్ లో చర్చించిన అంశాలపై త్రైమాసిక కార్యాచరణ ప్రణాళిక అమలుచేసే అంశంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖలు అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలను ఏప్రిల్,మే, జూన్ మాసాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయంలో పంటల సాగు, ఆధునిక వ్యవసాయ విధానాలు, డ్రిప్ ఇరిగేషన్, డ్రోన్ టెక్నాలజీ, ఫామ్ పాండ్లు, చెక్ డ్యాం లు, ఇతర నీటి సంరక్షణ పనుల నిర్మాణం తదితర అన్ని అంశాలను ఒకే చోట అమలు చేసేలా ఒక గ్రామాన్ని గుర్తించి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని అగ్రికల్చర్, హార్టికల్చర్, ఏపీఎంఐపి, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పది రోజుల్లో లోపల ఎందుకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సిసి ఆర్ సి కార్డులను త్వరితగతిన జారీ చేయాలని, సాయిల్ టెస్టింగ్ లో సాంకేతికత అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ, పశుగ్రాస విత్తనాల పంపిణీ కార్యక్రమాలను లక్ష్యాల్లో చేర్చాలని పశు సంవర్ధక శాఖ జేడీని ఆదేశించారు.టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ను అక్టోబర్ లోపు పూర్తి అయ్యేలా, వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఎంఐపీ పిడిని ఆదేశించారు.. బనవాసిలో టెక్స్టైల్ పార్క్ కు సంబంధించి తదుపరి చర్యలపై రాష్ట్రస్థాయిలో ఫాలో అప్ చేయాలని ఏపీఐఐసి, చేనేత జౌళి శాఖల అధికారులను ఆదేశించారు. టెక్స్టైల్ పార్క్ లో సైట్ డెవలప్మెంట్ చేసేందుకు కావలసిన మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.. దూపాడు, పాణ్యం రైల్వే లైన్ కు సంబంధించి త్వరితగతిన తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీజెడ్ ఎం ను ఆదేశించారు.విద్యుత్ శాఖకు సంబంధించి పి ఎం



సూర్య ఘర్ లక్ష్యాలను త్వరితగతిన సాధించాలని ఎస్ ఈ ని ఆదేశించారు.. విద్యుత్ సరఫరా లో ఏమైనా సమస్యలు ఉన్నాయని కలెక్టర్ ఎస్ ఈ ని ఆరా తీశారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద సిసి రోడ్ల నిర్మాణంతో పాటు నీటి సంరక్షణ పనులు తదితర పనులను చేపట్టే విధంగా లక్ష్యాలను రూపొందించుకోవాలని డ్వామా పిడిని ఆదేశించారు.జిల్లాలో పిపిపి మోడ్లో పర్యాటక అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా టూరిజం అధికారి,కర్నూలు మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. ఏ ఏ ప్రదేశాల్లో పర్యాటక అభివృద్ధికి వీలవుతుందో ఆ వివరాలను తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చేపడుతున్న మరమ్మతులను టాయిలెట్ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. అలాగే బిసి సంక్షేమానికి సంబంధించి ఎంపీ ల్యాడ్స్ నిధులు ఒక కోటి రూపాయలు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ 50 లక్షల రూపాయలతో హాస్టళ్ల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతోందని, పూర్తిగా మరమ్మతులు అవసరమైన వాటిని గుర్తించి, పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ను ఆదేశించారు.బ్రాడ్బ్యాండ్ కనెక్షన్ లేని 81 గ్రామాల్లో కనెక్షన్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని బిఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు.. పీ ఫోర్ విధానంలో బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శులను గుర్తించే అంశంపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సిపిఓను ఆదేశించారు.. జిల్లాలో వక్ఫ్ ప్రాపర్టీస్ పై సర్వే చేయించి, వాటి సంరక్షణకు వీలుగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేట్లను రూపొందించాలని డిఆర్ఓ మైనారిటీ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు.. మున్సిపాలిటీలలో శివారు ప్రాంతాల అభివృద్ధి పై దృష్టి పెట్టాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి పేద విద్యార్థికి ఉచిత కోచింగ్ ఇవ్వాలి



- విద్యార్థి సంఘాల డిమాండ్

కర్నూలు, ఏప్రిల్ 21 (మనం న్యూస్) ః డి ఎస్సి రాసే నిరుద్యోగ విద్యార్థులకు ప్రభుత్వము ఉచితంగా కోచింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలనీ సోమవారం విద్యార్థి నాయకులు కలెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, ఏ ఎస్ ఏ అధ్యక్షులు రాఘవేంద్ర, జై భీమ్ ఆర్మీ అధ్యక్షులు విజయభాస్కర్ లు మాట్లాడుతూ డిఎస్సి పరీక్షలు రాసే ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్, వసతి సౌకర్యం ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దానం తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామ సభకు హాజరైన ఆత్మకూరు ఆర్డిఓ శ్రీమతి నాగజ్యోతి




జూపాడుబంగ్లా ఏప్రిల్ 21 (మనం న్యూస్) : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా జూపాడు బంగ్లా మండలము మండ్లెం, గ్రామం లో రీ సర్వే పై అవగాహన కొరకు నిర్వహించిన గ్రామ సభకు ఆత్మకూరు ఆర్. డి. ఓ. శ్రీమతి డి. నాగజ్యోతి, హాజర య్యారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సర్వే కు తప్పనిసరిగా తమ వద్ద ఉన్న డాక్యుమెంట్స్ తో హాజరైనట్లయితే చాలా వరకు సమస్యలు సమసిపోతాయి అని, కావునా రైతులు రీ సర్వే కు ఖచ్చితంగా తమ దగ్గర ఉన్న డాక్యుమెంట్స్ తో హాజరవ్వాలని రైతులకు తెలియజేశారు. రీ సర్వే విషయం లో వచ్చే అనుమానాలు, సందేహాలు అపోహలు తీర్చడానికి రీ సర్వే గ్రామ సభ నిర్వహించడమైనది. మండ్లెం గ్రామములో మొత్తం విస్తీర్ణము : ఏకరములు

**మొత్తం ఖాతాలు: 2177**

**మొత్తం సర్వే నెంబర్లు 991**

**మొత్తం ప్రభుత్వ భూమి ఏకరములు**

మొదట గ్రామము యొక్క సరిహద్దు ను గుర్తిస్తారు తర్వాత ప్రభుత్వ భూమి సర్వే చేస్తారు, ఆ తర్వాత రైతులకు ఫారం 19 యిచ్చి రైతుల సమక్షంలో రీ సర్వే చేయడం జరుగుతోంది అని తెలియజేశారు .రైతులు సర్వే టీమ్ వస్తున్నప్పుడు అందరు పొలం దగ్గరకు హాజరై రీ సర్వే సక్రమంగా జరుగులాగునా సహకరించాలి అని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృపామ్మ , తహశీల్దార్ చంద్ర శేఖర్ నాయక్,డిప్యూటీ తహశీల్దార్లు సత్య దీప్, జి.నాగన్న, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ అఫ్ సర్వే ఉమాపతి, మండల సర్వేయర్ డి అతీఫ్, సహాయ గణాంక అధికారి హనుమంతు, గ్రామ రెవెన్యూ అధికారి ఈశ్వరయ్య, గ్రామ సర్వేయరులు పెద్దబాబు, ఉమరాణి, పంచాయితి కార్యదర్శి సుబ్బారెడ్డి గ్రామం రెవెన్యూ సహాయకులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోండి

- ప్రజల్లో అవగాహన కల్పించండి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




కర్నూలు, ఏప్రిల్ 21 (మనం న్యూస్) ః వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలు' పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి అందచేస్తున్న వివిధ పౌర సేవలు మరింత చేరువ చేసే క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ ను 9552300009 నెంబర్ ద్వారా తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. ఏప్రిల్ నెల 15వ తేది నుండి ఇంటివద్ద నుంచే పౌరసేవలు - మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం అయ్యా యన్నారు.. ఈ వేదిక ద్వారా ప్రజలు ప ధృవపత్రాలు, లైసెన్సులు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్ష ఫలితాలు వంటి 250 కి పైగా సేవలను పొందవచ్చునన్నారు.. అవినీతికి తావు లేకుండా వేగంగా సేవలు అందించేందుకు ఇది మరో ప్రగతిశీల చర్యగా నేటి సుపరిపాలనలో నిలవనుంద న్నారు.. ఈ సువర్ణావకాశాన్ని జిల్లా ప్రజలు అందరూ వినియోగించుకొని , తమకు కావలసిన పౌర సేవలను త్వరతగతిన పారదర్శకంగా పొందగలరని కలెక్టర్ కోరారు.. వాట్సాప్ మెసేజ్ మాత్రమే కాదు, వాయిస్ మెసేజ్ ద్వారా కూడా సేవలు అందే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా మెచ్చుకోదగిన విధంగా వ్యవస్థ రూపొందించబడిందన్నారు.

స్మార్ట్ఫోన్ లేని వారి కోసం ఎస్ఎంఎస్ ద్వారా సేవలు పొందే అవకాశాలు కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయన్నారు.. ఆర్టీజీఎస్ వ్యవస్థ ద్వారా అన్ని శాఖల డేటాను అనుసంధానిస్తూ, ప్రతి పౌరుడి సమాచారం ఆధారంగా సేవలను అందించ నున్నారన్నారు. ఖఖ కోడ్ ద్వారా ధృవపత్రాల నిజనిజాలను గుర్తించే సదుపాయం కూడా ఈ వేదికలో ఉంటుందన్నారు.. ప్రస్తుతం మనమిత్ర తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అందుబాటులో ఉంది. త్వరలో మరిన్ని భాషల్లో సేవలు పొందేలా చర్యలు చేపడుతున్నారన్నారు.. ఇళ్లకు వెళ్లి , సంబంధిత గృహ యజమానికి వాట్సప్ గవర్నెన్స్ పై అవగాహన కల్పిస్తూ కరపత్రములను అందించాలన్నారు. అదే విధంగా శక్తి యాప్, సైబర్ నేరాల పైన కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో నూతన హంగులతో కామారెడ్డి రైల్వేస్టేషన్



- జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్
- షబ్బీర్ అలీతో కలిసి రైల్వేస్టేషన్ ను పరిశీలించిన ఎంపీ

కామారెడ్డి, ఏప్రిల్ 21 ( మనం ప్రతినిధి)ః ఆర్నెళ్లలోనే కామారెడ్డి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారబోతున్నాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి రైల్వేస్టేషన్ను పరిశీలించారు. రైల్వే డివిజనల్ ఇంజినీర్ శశాంక్తో సమావేశమై మంజూరైన నిధులు, సమస్యలపై చర్చించారు. అనంతరం రైల్వేస్టేషన్లో 'అమృత్ భారత్ పథకం' కింద కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ., అమృత్ భారత్ స్కీం కింద పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కొత్తగా రెండు ఆర్వోబీల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని, పాత రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం కోసం సర్వే జరుగుతుందని, మట్టి పరీక్షలకు పంపించామని తెలిపారు.

ఆర్వోబీలతో పాటు పాదాచారులు, ద్విచక్ర వాహనదారుల కోసం అండర్ గ్రౌండ్ బ్రిడ్జికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. మున్సిపల్ రైల్వే శాఖల సమన్వయంతో పనులు చేపడతామని తెలిపారు. పాత రాజంపేట వద్ద ఆర్వోబీ కోసం నేషనల్ హైవే అథారిటీ వారికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లో తాగునీరు, టాయిలెట్స్ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్కలేటర్ నిర్మాణం కూడా ఆర్నెళ్లలో పూర్తవుతుందని పేర్కొన్నారు.

## వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి సరైన పత్రాలు లేకపోతే వాహనాలు సీజ్

- జొన్నగిరి సబ్ ఇన్స్పెక్టర్ ఎన్ సి మల్లికార్జున

తుగ్గలి, ఏప్రిల్ 21( మనం న్యూస్ )ః తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ ఎస్సై మల్లికార్జున వారి పోలీస్ సిబ్బందితో కలిసి చెరువు కట్ట దగ్గర సోమవారం వాహనాలను తనిఖీలు చేపట్టారు.అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు, సరైన పత్రాలు లేని10 పదిమంది వాహనదారులకు చలానా వేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు, అలాగే వాహనదారులు ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్, హెల్మెంట్, సీట్ బెల్ట్ ధరించాలని వాహనదారులకు ఎస్సై మల్లికార్జున సూచించారు, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారికి డ్రంక్



అండ్ డ్రైవ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు ఆత్మహత్యపై ప్రాథమిక విచారణ



మంత్రాలయం, ఏప్రిల్ 21(మనం న్యూస్) : మంత్రాలయం మండల పరిధిలోని సూగురు గ్రామంలో రైతు పెద్దయ్య ఆత్మహత్య గల కారణాలపై సోమవారం ప్రాథమిక విచారణ చేపట్టామని మండల వ్యవసాయ అధికారి జీరాగణేష్ తెలిపారు. గత రెండు రోజుల క్రితం మృతుడు కురువ పెద్దయ్య భార్య కురువ వీరనాగమ్మ అప్పుల బాధతో యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మంత్రాలయం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు మేరకు మండల వ్యవసాయ అధికారి జీరాగణేష్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా సూగూరు గ్రామంలో మృతుడి భార్య, కుమారులను విచారణ చేసి ఆత్మహత్య గల సంబంధిత సమాచారాన్ని పై అధికారులకు నివేదిక పంపుతునట్లు మండల వ్యవసాయ అధికారి జీరాగణేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్వతారోహకుడు సురేష్ బాబుకు ప్రోత్సహంగా ఆర్థిక సాయం అందచేత

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, ఏప్రిల్ 21 (మనం న్యూస్): నేపాల్ దేశంలో ఉన్న ప్రపంచంలోనే ఎత్తైన 7వ శిఖరం ధౌలగిరి శిఖరం అధిరోహించేందుకు భారతదేశంలోనే అతి చిన్న వయసు పర్వతారోహకుడైన సురేష్ బాబు అనే వ్యక్తికి ప్రోత్సాహంగా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు..జియోమైసూర్ కంపెనీ సిఎస్ఆర్ నిధుల కింద ఆర్థిక సాయం అందచేసిందని కలెక్టర్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సురేష్ బాబుకు లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ అందచేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామ నివాసి అయిన 25 సంవత్సరాల వయస్సు ఉన్న సురేష్ బాబు చిన్న వయసులోనే ప్రపంచంలోని ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారని, ఇప్పటివరకు ఇతడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25 శిఖరాలు అధిరోహించడమే కాకుండా



అతి తక్కువ సమయంలోనే మనకున్న 7 ఖండాలలో 5 ఖండాలలోని ఎత్తైన శిఖరాలను అధిరోహించి, తక్కువ సమయంలోనే ఎక్కువ పర్వతాలు అధిరోహించిన వ్యక్తిగా రికార్డ్ సృష్టించడం అభినంద నీయమన్నారు..అతనిలో ఉన్న ప్రతిభను గురించి ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందించిందిన జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, పొల్యూషన్ కిషోర్ రెడ్డి, జియో మైసూర్ కంపెనీ ప్రతినిధి రామ్మోహన్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం మీద ఏ రాజకీయ పార్టీ నాయకుడికి ప్రేమ లేదు

- తెలంగాణ రైతులకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్



నిజామాబాద్, ఏప్రిల్ 21( మనం ప్రతినిధి)ః తెలంగాణ రైతులకు వ్యవసాయం ఆంధ్ర ప్రాంతం వారు నేర్పించార్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. 'తెలంగాణ రైతులకు ఆంధ్రప్రాంతం వారు వ్యవసాయం నేర్పించారని పీసీసీ అధ్యక్షుడు మాట్లాడడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమాన పరిచినట్టే.... రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మహోత్సవ వేడుకలు జరపడం.. చంపినోడే..సంతాప సభ పెట్టినట్టు ఉంది.కేసిఆర్ చెప్పేది అక్షర సత్యం..బిఆర్ఎస్ కు తప్పా తెలంగాణ మీద ప్రేమ ఏ రాజకీయ పార్టీకి ఉండదు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తీవ్ర భావదారిద్ర్యంలో ఉన్నారు.

ఆంధ్ర పాలకుల మన్ననల కోసం ఇంకా ప్రాకులాడడం సిగ్గు చేటు అని ఆయన అన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటుకు అడ్డుపడ్డ సమైక్య పాలకుల అడుగులకు మడుగులొత్తిన కాంగ్రెస్ నాయకులు..ఇప్పుడు సొంత రాష్ట్రంలో ఉన్నామనే సోయి మరిచినట్టు ఉన్నారు.. తెలంగాణ వ్యవసాయ చరిత్ర తెలియని వ్యక్తులు.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ కు పాలకులు కావడం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యం ఆంధ్రలోని కోస్తా ప్రాంతంలో వరి తప్పా ఏది పండించరు, కానీ తెలంగాణ రైతులు వరితో పాటు వాణిజ్య పంటలైన పత్తి,పసుపు, చెరుకు, మిర్చి,మక్క జొన్న పంటలు పండిస్తారు. పల్లి,పెసర,శనగ,కందులు,మినుములు లాంటి ఆహార ధాన్యాలు పండిస్తారు. వెయ్యేళ్ళ క్రితమే దక్కన్ ప్రాంతంలో వరి ధాన్యం పండించిన చరిత్ర తెలంగాణ రైతులది వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన తెలంగాణ రైతులను అవమానించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెంటనే యావత్ తెలంగాణ సమాజానికి బే షరతుగా క్షమాపణ చెప్పాలి.' అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## బృందావనానికి విశేష పూజలు



మంత్రాలయం ఏప్రిల్ 21(మనం న్యూస్) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం మూల బృందావనాన్నికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనాన్నికి విశేష పంచామృతాభిషేకం, ఫల పుష్పాభి షేకం, సుప్రభాత సేవ, తులసి అర్చన, ఉత్సవ రాయల పాద పూజ, కనక మహా పూజ నిత్య నిర్మల్య అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా ఆదిపరాశక్తి మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఉత్సవ మూర్తి శ్రీ ప్రహ్లాద రాయలను గజ, కొయ్య, వెండి, బంగారు రథోత్సవాలపై ఉంచి మఠం ప్రాకారంలో అశేష భక్తుల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఉయ్యాల సేవ చేసి మహా మంగళహారతి ఇచ్చారు.

## తర్తూర్ శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి హుండీ లెక్కింపు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (మనం న్యూస్): జూపాడు బంగ్లా మండలంలోని తర్తూర్ గ్రామంలో వెలిసినటువంటి, రాయలసీమ జిల్లాల్లో ఎంతో పేరుగాంచిన. శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి, జాతరను అంగరంగ వైభవంగా జరిగించారు, ఈ జాతర 9 రోజులు జరిగించినప్పటికీ భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లకు నగదు,రూపకంగా వెండి రూపకంగా, మొక్కుబడుల కానుకలు హుండీలో వేసి ఉన్నారు, ఈ హుండీలోని లావాదేవీలను ఈ దినము అనగా 21 వ తేదీ ఏప్రిల్ 2025 న, ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో సాయికుమార్, పర్య వేక్షణలో తనిఖీ అధికారి పి హరిచంద్ర రెడ్డి సమక్షంలో సోమవారం ఈ లెక్కింపు నిర్వహించగా రూ, 11 లక్షల 21 వేల 770 రూపాయలు కానుకలు వచ్చాయని, కొంత వెండి మొక్కుబడి రూపంలో వచ్చిందని, ఆలయ ఈవో సాయికుమార్ తెలియజేశారు, గత సంవత్సరములో హుండీ లెక్కింపు కంటే ఈ సంవత్సరము ఉండి లెక్కింపు 43 వేల 131 రూపాయలు తగ్గిందని ఆయన తెలియజేశారు, ఈ హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ మందాడి నారాయణరెడ్డి,ఆలయ అధికారులు, అర్చకులు, ఆల య సిబ్బంది, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.








# చెన్నైకు 'ప్లేఆఫ్స్' ఛాన్స్.. గతేడాది ఆర్సీబీలా ఆడితేనే!



ఐపీఎల్ లో గెలుస్తుందనే మ్యాచుల్లో ఓడిపోవడం.. నాకౌట్ కు చేరుకోవడం కష్టమనుకొనే టీమ్ లు ప్లేఆఫ్స్ కు వెళ్లడం ఇప్పటికే మనం చూశాం. ఇప్పుడందరి దృష్టి ధోనీసేన పైనే ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో చివరన ఉన్న సీఎస్కే టాప్ -4లోకి దూసుకొచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇది సాధ్యం కావాలంటే ఒకే ఒక్క మార్గముంది. అదేంటి? గతంలో ఇలా ఏ జట్టైనా సాధించిందా? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం.

**సీఎస్కే మిగిలిన ఆరింట్లోనూ గెలిస్తేనే..**

చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటివరకు 8 మ్యాచులు ఆడింది. కేవలం రెండే విజయాలే ఉన్నాయి. అంటే నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో కొనసాగుతోంది. ఇంకా ఆరు మ్యాచులు ఉన్నాయి. వాటన్నింటినీ గెలిస్తే సీఎస్కే ఖాతాలో 16 పాయింట్లు చేరతాయి. ముంబయితో మ్యాచ్ అనంతరం ధోనీ కూడా 'ప్లేఆఫ్స్'కు క్వాలిఫై కావడానికి ప్రయత్నిస్తామని చెప్పాడు కదా. అంటే ఏ చిన్న ఛాన్సున్నా మిస్ చేసుకోమని దాని ఉద్దేశం. విజయాలు సాధించడంతోపాటు నెట్‌రన్‌రేట్ను కాస్త మెరుగుపర్చుకుంటే సీఎస్కేకు తిరుగుండదు. అయితే, టాప్ -4 ప్లేస్ల కోసం ఇప్పటికే తీవ్ర పోటీ నెలకొంది. ఏ ఒక్క మ్యాచ్లో ఓడినా తలుపులు మూసుకుపోవడం ఖాయం. చెన్నై సూపర్ కింగ్స్ తన సొంత మైదానం చెపాక్లో మూడు మ్యాచులను ఆడనుంది. మిగిలిన మూడు బయట వేదికల్లో తలపడాల్సి ఉంటుంది.

**ఎవరెవరితో మ్యాచులు?**

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఏప్రిల్ 25) - చెన్నై
పంజాబ్ కింగ్స్ (ఏప్రిల్ 30) - చెన్నై
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (మే 3) - బెంగళూరు
కోల్కతా నైట్‌రైడర్స్ (మే 7) - కోల్కతా
రాజస్థాన్ రాయల్స్ (మే 12) - చెన్నై
గుజరాత్ టైటాన్స్ (మే 18) - అహ్మదాబాద్

**బెంగళూరు కూడా ఇలానే..**

వరుసగా ఆరు మ్యాచులు ఓడిపోవడం.. తొలి ఎనిమిదిలో ఒకేఒక్క విజయం.. ఇలాంటి టీమ్ ప్లేఆఫ్స్కు వస్తుందని ఎవరైనా ఊహించగలరా? కానీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అసాధ్యమనుకున్న ఘనతను సుసాధ్యం చేసింది. ఐపీఎల్ 2024 సీజన్లో ఇలాంటి అరుదైన ఫీట్ నమోదైంది. అద్భుతంగా పుంజుకొన్న ఆర్సీబీ తాను ఆడిన తొమ్మిదో మ్యాచ్ నుంచి 14వ మ్యాచ్ వరకు వరుసగా ఆరింట్లో గెలిచింది. టాప్-4లో నిలిచి ప్లేఆఫ్స్కు చేరుకుంది. ఎలిమినేటర్లో రాజస్థాన్ చేతిలో ఓటమి పాలైందనుకోండి అది వేరే విషయం. అతి తక్కువగా ఉన్న ఛాన్స్ను ఏమాత్రం వదులుకోకుండా వరుసగా విజయాలను నమోదుచేసిన ఆర్సీబీని ఇప్పుడు సీఎస్కే స్ఫూర్తిగా తీసుకోవాలి. అప్పటి బెంగళూరుతో పోలిస్తే ఇప్పటి చెన్నై పరిస్థితే కాస్త మెరుగు.. కానీ, మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మాత్రం సీఎస్కేకు అవకాశాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని వ్యాఖ్యానించాడు.

**అవకాశాలు దాదాపు ముగిసినట్లే: కృష్ణమాచారి శ్రీకాంత్**

చెన్నైపై విజయం సాధించిన ముంబయి ఇండియన్స్ను శ్రీకాంత్ అభినందించాడు. "ఈ సీజన్లో ప్లేఆఫ్స్ కోసం సీఎస్కే పోరాటం దాదాపు ముగిసిందనుకుంటున్నా. రోహిత్, సూర్య మైదానంలోని నలుమూలలా బంతులను పంపించారు. ముంబయి అన్ని విభాగాల్లో బాగా ఆడింది. ఇప్పుడు సీఎస్కేకు ఒకటే సూచన ఇవ్వగలను. మిగతా మ్యాచుల్లో నిర్భయంగా ఆడేయండి" అని పేర్కొన్నాడు.

## అర్జున్ కు రజతం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ లో పారిస్ ఒలింపియన్ అర్జున్ బబుతా సత్తాచాటాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ లో రజత పతకంతో మెరిశాడు. ఫైనల్లో 252.3 పాయింట్లు స్కోరు చేసిన అర్జున్.. కేవలం 0.1 పాయింట్ తేడాతో బంగారు పతకానికి దూరమయ్యాడు. ఒలింపిక్ ఛాంపియన్ షెంగ్ లిహావో (252.4- చైనా) స్వర్ణం గెలుచుకున్నాడు. మహిళల 10 మీ ఎయిర్ రైఫిల్ లో ఆర్య బోర్సే అయిదో స్థానంలో నిలిచింది.

## ఆసియా బాక్సింగ్ లో భారత్ శుభారంభం

ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో భారత్ శుభారంభం చేసింది. తొలి రౌండ్లో హార్దిక్ దహియా, రుద్రాక్ష్ సింగ్ ఏకపక్ష విజయాలతో సత్తాచాటారు. అండర్-15 బాలుర 43 కేజీల విభాగంలో హార్దిక్ 5-0తో కుబనిచెక్ బొలుషోవ్ (కిర్గిస్తాన్)ను చిత్తుచేశాడు. 46 కేజీల విభాగంలో రుద్రాక్ష్ 5-0తో ఇబ్రఖిమ్ మరల్ (మంగోలియా)ను మట్టికరిపించాడు. ఈ టోర్నీలో భారత్ తరఫున 56 మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.

## సొంతగడ్డపై చిత్తుగా ఓడిన కోల్కతా.. గుజరాత్కు ఆరో విజయం



ఐపీఎల్ 18 లో కోల్ కతా నైట్ రైడర్స్ ను గుజరాత్ టైటాన్స్ 39 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ సీజన్ లో విజయాల పరంపర కొనసాగిస్తున్న గుజరాత్ ఆరో విజయం సాధించింది. తొలుత టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన కోల్ కతా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 159 పరుగులకే పరిమితం అయింది. ఆ జట్టులో కెప్టెన్ అజింక్యా రహానె (50: 36 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్) టాప్ స్కోరర్. ఆండ్రీ రస్సెల్ (21), రఘువంశీ (27*), రింకు సింగు (17) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్, వాషింగ్టన్ సుందర్, సాయి కిశోర్, ఇషాంత్ శర్మ ఒక్కో వికెట్ తీశారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ కు శుభ్ మన్ గిల్ (90: 55 బంతుల్లో 10 ఫోర్లు, 3సిక్స్ లు), సాయి సుదర్శన్ (52: 36 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్) తొలి వికెట్ 114 పరుగులు చేసి మంచి శుభారంభం అందించారు. అయితే గిల్ త్రుటిలో సెంచరీ చేసే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. సాయి సుదర్శన్ మరోసారి అదరగొట్టాడు. గత మ్యాచ్ లో చెలరేగిన జోస్ బట్లర్ (41*; 23 బంతుల్లో 8 ఫోర్లు) ఈ మ్యాచ్ లోనూ విరుచుకుపడ్డాడు. కోల్కతా బౌలర్లలో వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, రస్సెల్ తలో వికెట్ పడగొట్టారు.


## ఐపీఎల్‌లో రోబో డాగ్ సందడి.. దీని పేరేంటో తెలుసా?



ప్రస్తుతం ఐపీఎల్ 18 సీజన్ లో రోబో డాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మ్యాచ్ టాస్ సందర్భంగా కెప్టెన్లతోపాటు గ్రౌండ్లో దీని సందడి మామూలుగా లేదు. ఆటగాళ్ల వద్దకు వెళ్లడం, వారికి షేక్ హ్యాండ్ ఇస్తుండడంతో అంతా దీని చేష్టలను ఉత్సాహంగా గమనిస్తున్నారు. ఈ రోబోతో పలు జట్ల ఆటగాళ్లు సరదాగా ఆడుకుంటున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ముంబయి, చెన్నై మ్యాచ్ ప్రారంభానికి ముందు దీనికి అధికారికంగా 'చంపక్' గా నామకరణం చేశారు. ఇక ఈ రోబో విషయానికి వస్తే ఇది వేగంగా నడవగలదు, పరుగెత్తగలదు, వ్యాయామాలు చేయగలదు, జంప్ చేసేలా, కూర్చునేలా రూపకల్పన చేశారు. కొన్ని భావాలను సైతం వ్యక్తపరుస్తుంది. దీని తల ముందు భాగంలో కెమెరా ఉంది. ఇది ప్రేక్షకులకు అద్భుతమైన వీక్షణ అనుభవాన్ని అందివ్వగలదు. దీంతో ఈ సీజన్ బ్రాడ్ కాస్టింగ్ లో ఈ రోబో అంతర్భాగమైపోయింది.

## ఆ నిర్మాత నాతో దారుణంగా ప్రవర్తించాడు

బాలీవుడ్ బోల్ బ్యూటీ విద్యాబాలన్ గతంలో క్యాస్టింగ్ కౌచ్ పై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఓ దర్శకుడు తనతో అసభ్యకరంగా ప్రవర్తించాలనుకున్నాడని ఈ స్టార్ హీరోయిన్ ఆ మధ్య సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు తాజాగా 'ఒక నిర్మాత నాతో చాలా దారుణంగా ప్రవర్తించాడు.. అసభ్యంగా పిలిచాడు' అంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. 'ఒక నిర్మాత నాతో చాలా దారుణంగా ప్రవర్తించాడు. నేరుగా నా దగ్గరకు వచ్చి నన్ను అసభ్యంగా పిలిచాడు. అతను నన్ను అలా అవమానించిన తర్వాత నేను అద్దంలో ఆరు నెలలు నా ముఖం కూడా చూసుకోలేదు' అని విద్యాబాలన్ తెలిపింది. విద్యాబాలన్ ఇంకా మాట్లాడుతూ 'ఆ సమయంలో ఆ నిర్మాత లాంటి కొందరు వ్యక్తులు మాట్లాడే మాటలు నాపై నాకున్న నమ్మకాన్ని పూర్తిగా నాశనం చేశాయి. అలాగే, ఒక సినిమా కోసం నేను బరువు పెరుగుతున్న సమయంలో బాడీ షేమింగ్ చేసేవారు. ఒక సారి మలయాళంలో కూడా అవకాశం వచ్చింది. కానీ, ఆ సినిమా ప్రారంభం కాకముందే ఆగిపోయింది. దీంతో నన్ను దురదృష్టవంతురాలు అంటూ ప్రచారం చేశారు. మూవీ టీం ఆపేసిన అక్కడ నను బ్లెమ్ చేశారు. చెప్పుకుంటూ పోతే నా కెరీర్ లో ఇలాంటి చాలా ఉన్నాయి' అని విద్యాబాలన్ చెప్పుకొచ్చింది.





## సమంత రెండో పెళ్లి..?



సమంత - నాగచైతన్య విడిపోయాక సామ్ ఒంటరిగానే ఉంటుంది. అయితే, సమంత రెండో పెళ్లి పై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ గురించి తెలిసిందే. తాజాగా ఈ వార్త పై మళ్లీ రూమర్ వైరల్ అవుతుంది. సమంత రెండో పెళ్లికి సిద్ధమవుతుందని, తన బాయ్ ఫ్రెండ్ రాజ్ నిడుమోరుతో ఆమె పెళ్లి పీటలు ఎక్కబోతుందని టాక్ నడుస్తోంది. వీరిద్దరూ కలిసి నిన్న తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దీంతో ఈ రూమర్ కి బలం చేకూర్చినట్లు అయింది.

పైగా, ఇప్పటికే వారిద్దరూ డేటింగ్ లో ఉన్నారని, మే నెలలో పెళ్లిపీటలు ఎక్కబోతున్నారని కొత్తగా గాసిప్ వినిపిస్తోంది. అన్నట్టు సామ్ - రాజ్ పెళ్లికి ఇరు కుటుంబాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై ఇటు సమంతగానీ, అటు రాజ్ గానీ స్పందించలేదు. ఇక సమంత నిర్మాతగా వ్యవహరించిన 'శుభం' సినిమాలో అంతా కొత్తవారే నటించారు. నటిగా తన కెరీర్ మొదలు పెట్టిన సమయంలో యాక్టింగ్ గురించి తనకు పెద్దగా తెలియదన్నారు సమంత. 'శుభం' సినిమాలో నటీనటులు బాగా చేశారని సామ్ చెప్పింది.



## పవన్ వాటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడా..?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం వరుస చిత్రాలను రిలీజ్ కు రెడీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నుంచి రాబోతున్న సినిమాల్లో 'హరిహర వీరమల్లు', 'ఓజి' ఇప్పటికే మెజారిటీ షూటింగ్ పూర్తి చేసుకున్నాయి. ఈ రెండింట్లో 'హరిహర వీరమల్లు' కొద్ది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉండటంతో ఈ సినిమా రిలీజ్ తరుచూ వాయిదా పడుతూ వస్తోంది. ఇక ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో మేకర్స్ ఓ క్లారిటీకి రాబోతున్నట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు తో పాటు ఓజి చిత్రాల రిలీజ్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మేకర్స్ ఇప్పుడు వీలైనంత త్వరగా ఈ సినిమాలను ముగించి రిలీజ్ కు రెడీ చేయాలని చూస్తున్నారట. ఇక వీరమల్లు చిత్రంలో పవన్ చేయాల్సిన షూటింగ్ కొంతనే ఉండటంతో ఈ సినిమాను మే 2వ వారంలో లేదా 4వ వారంలో రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ భావిస్తోందట.

ఈ సినిమాలో పవన్ పాత్ర ప్రేక్షకులను స్టన్ చేయడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఇక ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## రామ్ డేటింగ్..? స్పందించిన భాగ్యశ్రీ బోర్సే!

తన అందం, అభినయంతో తొలి సినిమాతోనే అందరికీ అభిమాన నటిగా మారారు భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో ఆమె పేరు ట్రెండింగ్ అవుతోంది. దీనికి కారణం యంగ్ హీరో రామ్ పోతినేనితో ఆమె డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు ప్రచారం కావడమే.

వీరిద్దరూ కలిసి ఓ సినిమాలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కినప్పటి నుంచి వీరిద్దరిపై రూమర్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా వీరిద్దరూ షేర్ చేసిన ఫొటోల్లో బ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉండడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆ ఫొటోలు చూసిన నెటిజన్ లు 'ఒకే గదిలో ఫొటో దిగారా' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరొక నెటిజన్ ఇంకాస్త వివరంగా 'మీ చేతికి ఉంగరం ఉంది. అది ఎవరు తొడిగారు?' అని అడిగారు. దీనికి భాగ్యశ్రీ స్పందిస్తూ.. 'అది నేనే కొనుక్కున్నాను' అని రిప్లై పెట్టారు. ప్రస్తుతం వారి ఫొటోలతో పాటు ఆమె రిప్లై కూడా ఆసక్తిగా మారింది.

ప్రస్తుతం వీరిద్దరూ మహేశ్ బాబు.పి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇందులో సాగర్ గా రామ్ కనిపించనుండగా.. మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ అలరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. దీనితో పాటు దుల్కర్ సల్మాన్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'కాంత' లోనూ భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఇందులో రానా కీలకపాత్ర పోషిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.